ఆదివారం
01-01-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 190
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

చైనా కొత్త విదేశాంగ మంత్రి క్విన్‌గాంగ్

అమెరికాకు చైనా దౌత్యాధికారిగా ఉన్న క్విన్‌గాంగ్‌కు విదేశాంగ శాఖ బాధ్యతలను చైనా అప్పగించింది. ఇప్పటివరకు ఈ పదవీ బాధ్యతలు చేపట్టిన వాంగ్ యీ ఇటీవల చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యునిగా పదోన్నతి పొందారు.

2లో

సమాచార కమిషన్లు...
పనికిరాని మిషన్లు

- అరకొర సిబ్బంది - అసమర్థ పనితీరు
- రోజుకు కనీసం ఒక్క కేసూ పరిష్కారం కాని వైనం
- 3 లక్షల మార్కును దాటేసిన పెండింగ్ కేసులు
- మహిళా కమిషనర్లు నిల్
- సతర్క్ నాగరిక్ సంఘటన్ ప్రగతి నివేదికలో వెల్లడి

న్యూదిల్లీ: దేశంలోని సమాచార కమిషన్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. అరకొర సిబ్బందితో అసమర్థంగా పనితీరు ఉంటోంది. రోజుకు కనీసం ఒక్క కేసు పరిష్కరించలేని పరిస్థితిలో అనేక రాష్ట్ర సమాచార కమిషన్లు ఉన్నాయి. కేవలం ఏడాదిలో పెండింగ్ కేసులు లక్షకుపైగా పెరిగి మూడు లక్షల మార్కును దాటేశాయి. 60శాతం కమిషనర్లు పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులే ఉన్నారు. మహిళా కమిషనర్లే లేరు. వారి ప్రాతినిధ్యం పది శాతానికి మించలేదు. ఎలాంటి ఆదేశాలు లేకుండానే 40శాతం కేసులను కమిషన్లు తిప్పి పంపేస్తున్నాయి. భారీగా జరిమానాలు విధించాల్సి వచ్చినాగానీ నామామాత్రంగా విధిస్తూ చేతులు దులిపివేసుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఈ మేరకు సతర్క్ నాగరిక్ సంఘటన్ (ఎస్ఎన్ఎస్) తాజాగా విడుదల చేసిన ప్రగతి నివేదిక వెల్లడించింది. దేశంలోని మొత్తం 29 సమాచార కమిషన్ల పని తీరును అధ్యయనం చేసి ఈ నివేదికను రూపొందించినట్లు అధ్యయనకర్తలు అంజలీ భరద్వాజ్, అమృతా జోహ్రీ తెలిపారు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద 29 సమాచార కమిషన్ల పనితీరుపై నివేదికను సతర్క్ నాగరిక్ సంఘటన్ (ఎస్ఎన్ఎస్) విడుదల చేసినట్లు చెప్పారు. రాష్ట్ర సమాచార కమిషన్లు (ఎస్ఐసీ), కేంద్ర సమాచార కమిషన్లు (సీఐసీ)లో 145 ఆర్టీఐ అర్జీలు నమోదు కాగా ప్యానళ్లకు ప్రధానంగా పది ప్రశ్నలు సంధించినట్లు వారు వెల్లడించారు. కమిషన్లలో ఖాళీలు సమయానికి భర్తీ కావడం లేదని ఫలితంగా కేసుల పరిష్కారంలో తీవ్ర జాప్యం

- మిగతా 2 లో

వలంటీర్ల 'వారం'తిప్పలు

- నేటినుంచి పెన్షన్ వారోత్సవం
- పెంచిన సొమ్ముతో కలిపి రూ. 2,750 చెల్లింపు
- 64.06 లక్షల మంది లబ్ధిదారులు
- రూ.1,765 కోట్లు పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : వలంటీర్లకు 'వారం' తిప్పలతో నూతన సంవత్సరం ప్రారంభమవుతోంది. సామాజిక పెన్షన్లను జనవరి 1వ తేదీ నుంచి మరో రూ.250 పెంచుతూ రూ.2,750 చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పెన్షన్ పెంచిన సందర్భంగా అన్నిజిల్లాల్లో పెన్షన్ వారోత్సవాలను నిర్వహించాలని, లబ్ధిదారులను నేరుగా కల్సి అందజేయాలని సీఎం జగన్ ఆదేశించారు. దానితో ఆదివారం తెల్లవారుఝామునుంచే లబ్ధిదారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెపుతూ పెంచిన పెన్షన్‌తో రూ.2,750 అందజేసేందుకు వలంటీర్లను సన్నద్ధం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతంలో టీడీపీ ప్రభుత్వం అందజేసిన రూ.2వేలకు మరో రూ.250 పెంపు చేసి అందజేశారు. వాటిని

- మిగతా 2 లో

ఓ నిండు భూమి నిను రెండు చేతులతో కౌగిలించమని పిలిచినదా...
గుండె దాటుకుని పండుగైన కల పసిడి దారులను తెరిచినదా...
రుణం తీర్చే తరుణమిదిరా కిరణమై పదపదరా...
మరలి మరల వెనుదిరగనన్న చిరునవ్వే నీకు తొలి గెలుపు కదా...
మనసు వెతికే మార్గమిది రా... మంచికై పదపదరా...
లోకం చీకట్లు చీల్చే ధ్యేయం నీ ఇంధనం... హితం కోరే ప్రపంచ సౌఖ్యం నీకు గాక ఎవరికి సాధ్యం...
విశ్వమంతటికి పేరుపేరునా ప్రేమ పంచగల పసితనమా... ఎదురు చూసే ఎదను మీటే పవనమై పదపదరా...

2023

- సరికొత్త ఆశలతో... 2023 నూతన సంవత్సర శుభాకాంక్షలతో
విశాలాంధ్ర జాతీయ దినపత్రిక

బార్లు...బార్లా !

- తాగినోడికి... తాగినంత
- రాత్రి ఒంటిగంట వరకు మద్యం విక్రయాలు
- ప్రభుత్వ షాపుల్లో అర్ధరాత్రి 12 గంటల వరకు
- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మందు బాబులకు రాష్ట్ర ప్రభుత్వం తీపివార్త అందించింది. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ప్రభుత్వ వైన్ షాపులతో పాటు ప్రైవేటు బార్ అండ్ రెస్టారెంట్లలో మద్యం విక్రయ సమయాన్ని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ నిర్వహించే మద్యం దుకాణాల్లో

- మిగతా 2 లో

మాజీ పోప్ బెనెడిక్ట్ మృతి

2 లో

మాజీ పోప్ బెనెడిక్ట్-16 (95) శనివారం వాటికన్‌లో కన్నుమూశారు. వృద్ధాప్యం, అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 95వ ఏట మృత్యుఒడికి చేరుకున్నారు. ఈ మేరకు వాటికన్ అధికార ప్రతినిధి మెట్టేయో బ్రూని ప్రకటించారు.

2023కి ఘనస్వాగతం

2 లో

డిజిటల్ దోపిడీకి
అంతులేదా?

హ భాయ్... డాక్యుమెంట్స్ మత్ చాహియే... యాప్ ఖోలో బస్... పైసా ఆప్ ఖాతామే డాలేగా... డర్ మత్... పైసా పకడ్ కే ఛలో... అంటూ హిందీలో ముద్దుముద్దుగా మెస్సేజీలు పెడుతూ డిజిటల్ దోపిడీదారులు ప్రజలను ముగ్గులోకి లాగుతున్నారు. ఎక్కడ ఉంటారో తెలియదు... ఎలా ఉంటారో అంతకన్నా తెలియదు... స్మార్ట్ ఫోన్ తెరచాటున కథ నడుపుతారు. వారి వలలో చిక్కితే చాలు... ఒకటికి పదింతలు వసూలు చేసేంత వరకూ వేధింపులకు గురిచేస్తున్నారు. వడ్డీకి వడ్డీ వేస్తూ చక్రవడ్డీ లెక్కకడుతున్నారు. ఒక్క కిస్తీ ఆలస్యమైనా బూతు పురాణం విప్పుతూ మానసికంగా కుంగదీస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల అత్యవసరాలను ఆసరా చేసుకొని అప్పుల వలలో దించుతున్నారు. వారి బారినపడి ఎంతోమంది ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్యులు బలవన్మరణం చెందుతున్నారు. ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నా నిత్యం దేశంలో ఎక్కడో ఓ మూల డిజిటల్ గ్యాంగ్ వేధింపులకు ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి.

- చక్రవడ్డీలతో జీవితాలు చిన్నాభిన్నం
- కిస్తీ ఆలస్యమైతే... వేధింపులు, బూతులు
- ఫొటోల మార్ఫింగ్‌తో అసభ్యకర పోస్టులు
- లోన్ యాప్ జోలికెళ్లొద్దని ప్రభుత్వాల హెచ్చరిక
- ఆగని ఆన్‌లైన్ గ్యాంగ్ ఆగడాలు
- శాశ్వత నిషేధం కోసం మహిళల వినతి

విశాలాంధ్ర-డిజిటల్: తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ అప్పులు అమాయకుల ప్రాణాలు బలిగొంటున్నాయి. రుణ యాప్ క్లిక్ చేస్తే చాలు...ఇక కష్టాలే వెంటాడుతూ ఉంటాయి. బయటపడదామన్నా సాధ్యం కాదు. ఆ తెరచాటు మనుషుల వలలో చిక్కుకున్న వారెవరూ బయటపడే అవకాశమే లేదు. అరచేతిలో వైకుంఠం చూపుతున్న టెక్నాలజీ లోన్ యాప్ అదే చేతితో ప్రాణాలు తీసేస్తోంది. మీ మొబైల్‌లో ఒక్క క్లిక్‌తో యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి... హామీ వద్దు... డాక్యుమెంట్ అంతకన్నా అవసరం లేదు... రుణం పొందు వంటి ముద్దుముద్దు మాటలతో పేద, మధ్య, దిగువ మధ్య తరగతి కుటుంబాలను డిజిటల్ దోపిడీదారులు టార్గెట్ చేస్తున్నారు. రుణం ఉచ్చులోకి లాగే వరకు హుందాగా మాట్లాడతారు. రుణం పొందాక ఒక్క ఈఎంఐ ఆలస్యమైతే చాలు... పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగే పోస్టులు పెట్టి రుణగ్రహీతలకు చుక్కలు చూపుతున్నారు. మధ్యవర్తులుగా చీకటి మనుషులను నియమించుకొని...రెచ్చిపోతున్నారు.

అత్యవసరాలకు అప్పు ఇచ్చేవారు లేకపోవడంతో

- మిగతా 2 లో

త్వరలో కేంద్ర కేబినెట్
పునర్వ్యవస్థీకరణ?

- బీజేపీకి లబ్ధి చేకూర్చేలా కొత్తవారికి అవకాశాలు
- తెలంగాణ నేతలకూ ఛాన్స్!

న్యూదిల్లీ: కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ సంక్రాంతి తర్వాత జరుగనున్నది. అయితే అది బడ్జెట్ సమావేశాలకు ముందే జరుగుతుందని తెలుస్తోంది. బీజేపీలో వ్యవస్థాగత మార్పులతో సంబంధం ఉండేలా 2023లో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో పార్టీ రాజకీయ అవసరాలకు అనుగుణంగా కేబినెట్ ప్రక్షాళన ఉండనున్నట్లు సమాచారం. 2024లో లోక్‌సభ ఎన్నికలు జరగనుండటంతో మంత్రివర్గంలో

- మిగతా 2 లో

దిగజారుడు మాటలు

జగన్, ధర్మాన వ్యాఖ్యలపై రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కందుకూరులో ప్రమాదవశాత్తూ సంభవించిన మరణాలకు రాజకీయాలు ఆపాదించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దిగజారి మాట్లాడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు. విశాఖను చిన్న రాష్ట్రంగా ప్రకటించాలన్న మంత్రి ధర్మాన ప్రసాదరావుకు మతిభ్రమించిందని మండిపడ్డారు. ఈ మేరకు శనివారం రామకృష్ణ ఓ ప్రకటన విడుదల చేశారు. కందుకూరులో చంద్రబాబు రోడ్‌షో సందర్భంగా ప్రమాదవశాత్తు సంభవించిన మరణాలను రాజకీయం చేయటం సీఎం జగన్‌కు, ఆయన సలహాదారులకు తగదని హితవు పలికారు. మృతుల కుటుంబాలకు సహాయమందించి అండగా నిలవాల్సిన ముఖ్యమంత్రి, మంత్రులు, సలహాదారులు...ఆ మరణాలు 'చంద్రబాబు చేసిన హత్యలుగా' చిత్రీకరిస్తూ వ్యాఖ్యానించడం దుర్మార్గమని పేర్కొన్నారు. చంద్రబాబు వల్లే కందుకూరు మరణాలు జరిగి ఉంటే ఆయనపై హత్యానేరం కేసులు ఎందుకు మోపలేదు? అని ప్రశ్నించారు. రాజకీయాల్లో అసందర్భ ప్రేలాపనలు, వ్యాఖ్యానాలకు వైసీపీ శ్రేణులు స్వస్తి పలకాలని సూచించారు. విశాఖపట్నాన్ని రాజధానిగా చేయాల్సిందేనని, లేనిపక్షంలో దీనిని కొత్త రాష్ట్రంగా ప్రకటించాలనడం రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాద రావు అవివేకానికి నిదర్శనమని రామకృష్ణ విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా సాక్షాత్తూ శాసనసభలో అమరావతిని రాజధానిగా ఆమోదించిన విషయం ధర్మానకు తెలియదా? అని రామకృష్ణ ప్రశ్నించారు. అమరావతిని ధ్వంసం చేయాలనే కుట్రలో భాగమే ధర్మాన విపరీత వ్యాఖ్యలని పేర్కొన్నారు. అనాలోచిత వ్యాఖ్యలు చేసిన

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మీ పాలనలో నాకు ఇక్కడ ఫుల్లుగా చిరిగిపోయింది సారూ!

టికెట్లకు గిరాకీ

- ఆర్టీసీ, రైళ్లు, ప్రత్యేక బస్సుల సీట్లు ఫుల్
- రానుపోనూ ముందస్తు రిజర్వేషన్లు
- ప్రైవేట్ యాజమాన్యం దోపిడీ
- భారీగా ధరలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సంక్రాంతి పండగకు ఏపీఎస్ఆర్టీసీ బస్సులు, రైళ్ల టికెట్లకు భారీ గిరాకీ నెలకొంది. సంక్రాంతి సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి ప్రజలు ఎక్కువ సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. చాలామంది రైళ్లు, బస్సుల ద్వారా కుటుంబ సమేతంగా వస్తుంటారు. ముందస్తుగా కేటాయించిన బస్సులు, రైళ్ల టికెట్లు పూర్తవ్వడంతో ప్రయాణికులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో సీట్లు, రైళ్లల్లో బెర్తుల కొరత ఏర్పడింది. ఒకేసారి రానుపోను టికెట్లు బుక్ చేసుకున్న వారికి చార్జీలో 10శాతం రాయితీని యాజమాన్యం కల్పించింది. ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ చార్జీలే (ఎలాంటి చార్జీలు పెంచకుండా) వసూలు చేస్తామని ప్రకటించింది. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యమూ ఏర్పాటు చేసింది. దీంతో ఏపీఎస్ఆర్టీసీ ఆన్‌లైన్, ఏటీబీ ఏజెంట్లు, ఏపీఎస్ఆర్టీసీ యాప్ ద్వారా ప్రయాణికులు ముందస్తు టికెట్ల రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. అన్ని బస్సులకూ జీపీఎస్ ట్రాకింగ్ సదుపాయం కల్పించింది. గత దసరా అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని, దసరా తరహాగానే సంక్రాంతి ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ చార్జీలే వసూలుకు నిర్ణయించారు. ప్రయాణికుల డిమాండ్‌నకు అనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు

- మిగతా 2 లో

మూడు బాలిస్టిక్ క్షిపణులు పరీక్షించిన ఉ.కొరియా

సియోల్: ఉత్తరకొరియా మూడు బాలిస్టిక్ క్షిపణులను శనివారం జపాన్ సముద్రం దిశగా ప్రయోగించింది. దగ్గర లక్ష్యాలను ఛేదించగల ఈ క్షిపణులను ఉత్తర కొరియా, ఉత్తర హ్వాంగ్ ప్రావిన్స్‌లోని చుంగ్వా కౌంటీ నుంచి ఉదయం 8 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) ప్రయోగించినట్లు దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ (జేసీఎస్) తెలిపారు. ఉత్తర కొరియా కదలికలపై తమ నిఘా ఉన్నదని ఆయన పేర్కొన్నట్లు యోన్హప్ వార్తాసంస్థ వెల్లడించింది. తాజాగా ప్రయోగించిన మూడు క్షిపణలు కూడా 100కిమీల ఎత్తులో 350కిమీలు ప్రయాణించి జపాన్ ఆర్థిక జోన్‌ను దాదాపుగా తాకినట్లు జపాన్ రక్షణశాఖ తెలిపింది. ప్యాంగ్యాంగ్ తాజా పరీక్షలపై సమగ్ర వివరాలను సేకరించాలని సంబంధిత మంత్రిత్వశాఖలకు జపాన్ ప్రధాని కిషిడా ఆదేశాలు జారీచేసినట్లు క్యోడో వార్తాసంస్థ పేర్కొంది. ఉత్తర కొరియా వరుసగా అణ్వాయుధాలను పరీక్షిస్తూనే ఉంది. ఈ ఏడాదిలో మొత్తంగా 40 పరీక్షలు నిర్వహించి 70 వరకు మిసైళ్లను ప్రయోగించింది. నవంబరులో అత్యాధునిక ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించిన విషయం విదితమే. అమెరికాతో దక్షిణ కొరియా స్నేహం క్రమంలో సోదరదేశాల మధ్య ఉద్రిక్తత కొనసాగుతోంది.

చైనా కొత్త విదేశాంగ మంత్రి క్విన్‌గాంగ్

బీజింగ్: అమెరికాకు చైనా దౌత్యాధికారిగా ఉన్న క్విన్‌గాంగ్‌కు విదేశాంగ శాఖ బాధ్యతలను చైనా అప్పగించింది. ఇప్పటివరకు ఈ పదవీ బాధ్యతలు చేపట్టిన వాంగ్ యీ ఇటీవల చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యునిగా పదోన్నతి పొందారు. దీంతో క్విన్‌గాంగ్ (56)ను నూతన విదేశాంగ మంత్రిగా నియమిస్తూ చైనా ప్రకటన చేసింది. ఇదే క్రమంలో చైనా-భారత్ సరిహద్దు యంత్రాంగానికి ప్రత్యేక ప్రతినిధిగా వాంగ్ బాధ్యతలనూ క్విన్ స్వీకరించే సూచనలు ఉన్నాయి. క్విన్ నియామకాన్ని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా చుయింగ్ ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. కొత్త బాధ్యతలు చేపడుతున్న క్విన్ గాంగ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన ట్వీట్ చేశారు. చైనాలో కొత్త దౌత్య అధ్యయనం మొదలు కానున్నట్లు పేర్కొన్నారు.

మాజీ పోప్ బెనెడిక్ట్ మృతి

వాటికన్: మాజీ పోప్ బెనెడిక్ట్-16 (95) శనివారం వాటికన్‌లో కన్నుమూశారు. వృద్ధాప్యం, అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 95వ ఏట మృత్యుఒడికి చేరుకున్నారు. ఈ మేరకు వాటికన్ అధికార ప్రతినిధి మెట్టేయో బ్రూని ప్రకటించారు. 'పోప్ ఎమిరటస్ బెనెడిక్ట్-16 కన్నుమూశారు. ఆయన ఉదయం 9.34 గంటలకు తుదిశ్వాస విడిచారు' అని బ్రూని వెల్లడించారు. బరువెక్కిన హృదయంతో ఈ విషాదకర ప్రకటన చేస్తున్నానన్నారు. కాగా పోప్ బెనెడిక్ట్ అత్యున్నత పదవికి రాజీనామా చేశారు. ఆరోగ్యం సహకరించక పదవీవిరమణ చేశారు. ఇందుకు దశాబ్దం గడిచింది. పోప్ పదవికి రాజీనామా చేయడం ఆరు దశాబ్దాల్లో ఇదే మొదటిసారి కావడం విశ్లేషం.

జర్మనీలో జోసెఫ్ రాట్‌జింగర్‌గా జన్మించిన బెనెడిక్ట్ 2005లో పోప్ అయ్యారు. అప్పట్లో ఆయనకు 78ఏళ్లు. 2013లో రాజీనామా చేసిన తర్వాత తన శేషజీవితాన్ని వాటికన్‌లో మేటర్ ఎక్లేసియా కాన్వెంట్‌లో గడిపారు. పోప్ ఫ్రాన్సిస్ బుధవారం వాటికన్‌లో ప్రసంగిస్తూ పోప్ ఎమెరిటస్ బెనెడిక్ట్ ఆరోగ్యం విషమంగా ఉన్నదని, ఆయన కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయాలని భక్తులను కోరారు. పోప్ ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో మాజీ పోప్ అంత్యక్రియలు జరుగనున్నాయి.

19.67 శాతం పెరిగిన ఎన్ఐఏ కేసులు

2022లో 73 కేసులు... 456 మంది అరెస్టు

న్యూఢిల్లీ : దేశంలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) 2022వ సంవత్సరంలో 73 కేసులు నమోదు చేసింది. గత ఏడాది 61 కేసులతో పోల్చితే, కేసుల సంఖ్య 19.67 శాతం పెరిగాయి. ఇంతకుముందెన్నడూ లేనివిధంగా 2022లోనే ఎన్ఐఏ కేసులు అధికం. ఈ 73 కేసులకుగాను, జమ్ముకశ్మీర్, అసోం, బీహార్, ఢిల్లీ, కర్ణాటక, కేరళ, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌లో జిహాది ఉగ్రవాదానికి సంబంధించి 35 కేసులు ఉన్నాయి. కాగా జమ్ముకశ్మీర్‌లో 11 కేసులు, 10 కేసులు ఎల్‌డబ్ల్యూఈ కేసులు, ఇక ఈశాన్య భారతంలో 5 కేసులు, పీఎఫ్ఐ సంబంధిత కేసులు 7, పంజాబ్‌లో 5 కేసులు ఉన్నాయి. అలాగే గ్యాంగ్‌స్టర్-ఉగ్రవాదం-మాదకద్రవ్యాల అక్రమ రవాణాతో సంబంధం ఉన్న కేసులు 3 ఉండగా, ఎఫ్ఐసీఎన్‌కు సంబంధించిన కేసులు 2, ఉగ్రవాద నిధి కేసు ఒకటి ఉంది. ఎన్ఐఏ 2022లో 368 మందిపై 59 చార్జిషీట్‌లు దాఖలు చేసింది. పరారీలో ఉన్న 19 మంది సహా ఉగ్రవాద కేసులతో సంబంధం ఉన్న 456 నిందితులను అరెస్టు చేసింది. ఇద్దరు నిందితులను బహిష్కరణపై, ఒకరిని అప్పగించిన తర్వాత అరెస్టు చేసింది. 2022లో 38 కేసుల్లో తీర్పులు వెలువడ్డాయి. ఇవన్నీ నేరారోపణతో ముగిశాయి. మొత్తం 109 మందికి జరిమానాతో పాటు కఠిన శిక్ష, అలాగే ఆరుగురికి జీవిత ఖైదు పడింది. మొత్తంగా శిక్ష రేటు 94.39 శాతంగా ఉంది. 2022లో ఎనిమిది మందిని ఉగ్రవాద నిరోధక చట్టం (ఉపా) కింద గుర్తించగా, ఎన్ఐఏ వారిపై అవసరమైన చర్యలు తీసుకుంటుంది. ఉగ్రవాద నిధిని అరికట్టేందుకు, వారి ప్రయత్నాలను తిప్పికొట్టే చర్యల్లో భాగంగా, నవంబరు 18-19 తేదీల్లో 'నో మనీ ఫర్ టెర్రర్' పేరుతో మూడవ మంత్రుల స్థాయి సదస్సును ఎన్ఐఏ విజయవంతంగా నిర్వహించింది. ఈ సదస్సుకు 16 బహుపాక్షిక సంస్థల సభ్యులు, 78 దేశాల నుంచి సభ్యులు హాజరయ్యారు.

220 కోట్ల కోవిడ్ టీకాల పంపిణీ

కేంద్ర ఆరోగ్యశాఖకు సవాళ్లభరితంగా 2022

న్యూఢిల్లీ: కోవిడ్ మహమ్మారి రెండేళ్ల పాటు ప్రపంచ దేశాలను అల్లకల్లోలం చేసింది. ఆ తర్వాత కాస్త నెమ్మదించింది. కానీ 2022లో ఒమిక్రాన్ దశాలవారీ విజృంభణ కొనసాగింది. భారత్‌పైనా దీని ప్రభావం తీవ్రంగా కనిపించింది. కాలక్రమేణ కొత్త ఇన్ఫెక్షన్ల ప్రభావం తగ్గి సామాన్య పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది చివరిలో కొత్త వేరియంట్ కలకలం రేపింది. కోవిడ్ కాలంలో కేంద్ర ఆరోగ్యశాఖ ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నది. అన్ని వేళల్లో అప్రమత్తంగా ఉంటూ సేవలు అందించింది. జూన్, జులై, ఆగస్టు నెలల్లో మంకీపాక్స్ వైద్య రంగానికి సవాల్ విసిరింది. గాంబియా, ఉజ్బెకిస్థాన్‌లో భారత్‌లో తయారైన దగ్గు మందు కారణంగా చిన్నారులు మృత్యువాత పడటం కూడా సవాల్‌గా మారింది. మరోవైపు కోవిడ్ వ్యాప్తిగతి తగ్గినాగానీ కేసులు నమోదవుతూనే ఉండటంతో అన్ని దేశాలు అప్రమత్తంగా ఉన్నాయి. కొత్త వేరియంట్ ఆనవాళ్లు అమెరికా, చైనా, జపాన్, దక్షిణ కొరియా, బ్రెజిల్, ఫ్రాన్స్‌లో కనిపించడంలో అంతర్జాతీయ ప్రయాణాలపై ఆంక్షలు తిరిగి అమలయ్యాయి.

సిరియా నుంచి దళాల ఉపసంహరణకు టర్కీ అంగీకారం

అంకార: సిరియా భూభాగం నుంచి తమ దళాలను ఉపసంహరించుకునేందుకు టర్కీ అంగీకరించింది. తాజాగా మాస్కోలో జరిగిన రష్యా, సిరియా, టర్కీ మధ్య త్రైపాక్షిక చర్చలు ఫలించిన క్రమంలో దళాల ఉపసంహరణకు అంకార అంగీకరించినట్లు సిరియా వార్తాసంస్థ పేర్కొంది. టర్కీ, రష్యా, సిరియా నాయకుల సమావేశాన్ని నిర్వహించాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను డిసెంబరు 15న టర్కీ అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్ కోరారు. ఇంటెలిజెన్స్, రక్షణ, విదేశాంగ శాఖాధిపతులు ఈ సమావేశంలో పాల్గొనేలా చూడాలని సూచించారు. ఇదే క్రమంలో సిరియా సంక్షోభానికి పరిష్కారం కనుకునే దిశగా మూడు దేశాలు మాస్కోలో భేటీ అయి సుదీర్ఘంగా చర్చించినట్లు రష్యా రక్షణశాఖ వెల్లడించింది.

11 ఏళ్లలో అంకార, దమాస్కస్ మధ్య తొలి అధికారిక భేటీ కావడంతో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ క్రమంలో ఉత్తర సిరియా నుంచి తమ దళాలను ఉపసంహరించుకునేందుకు టర్కీ అంగీకరించిందని, అలెప్పో-లటాకియాను కలిపే ఎం4 హైవే ప్రారంభోత్సవం సందర్భంగా 2020లో జరిగిన ఒప్పందం అమలు దిశగా ఏకాభిప్రాయం కుదిరిందని అధికార వర్గాలు వెల్లడించాయి.

2023కి ఘనస్వాగతం

అంబరాన్నంటిన సంబరాలు

న్యూఢిల్లీ: కొత్త సంవత్సరం వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రపంచ దేశాలు క్రమంగా 2023కి స్వాగతం పలికాయి. కోవిడ్ ప్రభావం తగ్గిన నేపథ్యంలో ఆస్ట్రేలియా, సిడ్నీ, మెల్బోర్న్, అమెరికాలోని న్యూయార్క్, బ్రిటన్‌లోని లండన్, దుబాయి, పారిస్‌లోనూ సంబరాలు అంబరాన్ని అంటాయి. విద్యుత్ దీపాలతో చరిత్రాత్మక భవనాలు మెరిసిపోయాయి. వీధుల్లో కోలాహలం కలినిపించింది. బాణాసంచాతో ఆకాశం మిరిమిట్లుగొలిపింది. అయితే 'సమోవా' ద్వీపంలో ప్రతి సంవత్సరం కొత్త ఏడాది మొదటగా ప్రారంభమవుతుందిగానీ ఈసారి కిరిబాటి దీవులు ఆ రికార్డును సొంతం చేసుకున్నాయి. 'సమోవా' ద్వీపం గంట ఆలస్యంగా టైమ్ జోన్ మార్చుకోవడం వల్లనే ఇలా జరిగింది.

సమోవాలో నూతన సంవత్సర వేడుకలు ప్రారంభమైన ఎనిమిదిన్నర గంటలకు భారత్, శ్రీలంక దేశాలు కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాయి. భారత్ కాలమానం ప్రకారం శనివారం సాయంత్రం 4.30 గంటలకు న్యూజిలాండ్‌లో కొత్త ఏడాది ప్రారంభమైంది. ఆస్ట్రేలియాలో భారత్ కంటే ఐదున్నర గంటల ముందే నూతన సంవత్సరం మొదలూంది. మూడున్నర గంటల ముందుగా జపాన్, దక్షిణ కొరియా, ఉత్తరకొరియా దేశాలు కూడా 2023కి ఘనంగా స్వాగతం పలికాయి. పొరుగు దేశాలైన భూటాన్, నేపాల్, బంగ్లాదేశ్ కూడా అరగంట ముందుగానే కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టేశాయి. ఆ తర్వాత 43 దేశాల్లో ఒకేసారి కొత్త ఏడాది ప్రారంభమైంది. బేకర్, హోవార్డ్ దీవుల్లో ఆఖరిగా నూతన సంవత్సరం ప్రారంభవుతుంది.

దిగజారుడు మాటలు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి ధర్మాన మంత్రి పదవికి అనర్హుడని వ్యాఖ్యానించారు. ఏపీకి రాజధాని ఏర్పాటు చేయాలన్న ఆలోచన జగన్‌మోహన్‌రెడ్డికి లేనట్లు కనపడుతోందని, మూడు రాజధానులంటూ రాష్ట్రానికి రాజధాని లేకుండా మూడున్నరేళ్లు గడిపేసిన ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారని అభిప్రాయపడ్డారు. హైకోర్టు అమరావతిలోనే ఉంటుందని సుప్రీంకోర్టులో స్పష్టంచేసి, ఇక్కడ కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తామని వైసీపీ నేతలు చెప్పడం ప్రజల్ని మోసం చేయడమేనని నిందించారు. బాధ్యతాయుత స్థానాల్లో ఉండి పదేపదే వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ముఖ్యమంత్రి, మంత్రులకు సరికాదని, ఏపీ రాజధానిపై వివాదాలకు తెరదించాలని రామకృష్ణ సూచించారు.

డిజిటల్ దోపిడీకి అంతులేదా?

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు ఆన్‌లైన్ అప్పుల్లో చిక్కుకుంటున్నట్టు తెలుస్తోంది. సులభంగా తమ బ్యాంక్ ఖాతాలో నగదు జమ అవుతుందన్న ఆతృతతో షరతులను సైతం ప్రజలు గుర్తించడం లేదు. కుటుంబ అవసరాలకు రుణం తీసుకుంటే రెండు నెలలు తిరగకుండానే వేధింపులు... అసలుకు పది రెట్లు చెల్లించాలని ఫోన్లమీద ఫోన్లు చేస్తూ అప్పుదారుడినే కాక ఆన్‌లైన్ దరఖాస్తులో పేర్కొన్న బంధుమిత్రుల ఫోన్ నంబర్లకు కూడా అసభ్య మెసేజ్‌లు పెడుతున్నారు. పరువుపోతుందన్న మనస్తాపంతో బాధితులు మృత్యుమార్గం వెదుక్కుంటున్నారు. సకాలంలో కిస్తీలు కట్టకపోవడం, వడ్డీ చక్రవడ్డీగా మారడంతో రుణం తిరిగి చెల్లించలేక మృత్యుమార్గాన్ని ఎంచుకుంటున్నారు.

భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న యువతకూ రుణ యాప్‌లు యమపాశాలుగా మారాయి. విద్యావసరాలకు రూ.5 వేలు తీసుకుంటే నెల తిరక్కుండానే రూ.50 వేలు చెల్లించాలని, లక్ష తీసుకుంటే రూ.7 లక్షలు కట్టాలని కాల్ సెంటర్ నుంచి ఫోన్లు వస్తున్నాయి. వేధింపులు, ఫొటోల మార్ఫింగ్ వంటివి నిత్యకృత్యమయ్యాయి. ఆశ్చర్యమేమంటే రుణం మొత్తం చెల్లించినా ఇంకా బాకీ తీర్చాలని వెంటపడుతుండడం దుర్మార్గం. క్రూరంగా ప్రవర్తిస్తున్న ఆన్‌లైన్ రుణ యాప్‌లు లేకుండా చేయాలని ప్రభుత్వాలు, పాలకులకు మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు. వీటన్నింటినీ శాశ్వతంగా నిషేధించాలని కోరుతున్నారు. చట్టాలను పటిష్ఠపరిచి తెరచాటు మనుషులకు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేస్తున్నారు. నిత్యం ఏదోచోట లోన్‌యాప్ దురాగతాలకు అమాయకులు బలవుతూనే ఉన్నారు.

ప్రభుత్వాల స్పందన: లోన్ యాప్ దోపిడీదారుల ఆగడాలు శ్రుతిమించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాయి. చట్టబద్ధ లోన్ యాప్ లిస్ట్ తయారు చేయాలని రిజర్వు బ్యాంక్‌ను ఆర్థిక శాఖ ఆదేశించింది. కాల్ సెంటర్ ఏర్పాటు చేసి బాధితులు 1930కి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. లోన్‌యాప్ లింక్‌ల జోలికి వెళ్లవద్దని ప్రజలకు సూచన చేసింది. మొబైల్‌లో కాంటాక్ట్ అడ్రస్‌లు, లొకేషన్ షేర్ చేయవద్దని తెలిపింది. పోలీసులు కూడా చట్టబద్ధత లేని లోన్ యాప్‌ల జోలికి వెళ్లవద్దంటూ హెచ్చరిస్తున్నారు. 109కు ఫోన్ చేయాలని అవగాహన కల్పిస్తున్నారు.

టికెట్లకు గిరాకీ

(మొదటిపేజీ తరువాయి)

చేయనందున, వారంతా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను ఆశ్రయిస్తూ దోపిడీకి గురవుతున్నారు. సంక్రాంతి పండగకు వివిధ ప్రాంతాలకు వెళ్లే వారి కోసం 6,400 ప్రత్యేక బస్సుల్ని ఏపీఎస్‌ఆర్టీసీ ఏర్పాటు చేసింది. జనవరి 6 నుంచి 14వరకు 3120 ప్రత్యేక బస్సులను నడపనున్నది. సంక్రాంతి తర్వాత 15 నుంచి 18వరకు 3280 బస్సులను ఆర్టీసీ యాజమాన్యం ఏర్పాటు చేసింది. వాటిని సాధారణ చార్జీలతో నడపడంతో ప్రయాణికుల నుంచి ఆదరణ లభించింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రజలు భారీగా ముందస్తు రిజర్వేషన్లు చేయించుకున్నారు.

ప్రత్యేక బస్సులు పెంచాల్సిందే

సంక్రాంతికి ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో సీట్ల కొరత ఉన్నందున అదనంగా బస్సుల సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నప్పటికీ, యాజమాన్యం స్పందించడం లేదు. ఏపీఎస్‌ఆర్టీసీ నుంచి తెలంగాణలోని ఇతర ప్రాంతాల నుంచి 3,600 బస్సులు, బెంగుళూరు నుంచి 430, చెన్నయ్ నుంచి 150 ప్రత్యేక బస్సులను పట్టణాలు, నగరాలకు బస్సులు నడుపుతారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి విజయవాడకు 800, విశాఖపట్నానికి 450, రాజమహేంద్రవరానికి 200, ఇతర ప్రదేశాలకు 770 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ యాజమాన్యం ఏర్పాటు చేసింది. ప్రత్యేక బస్సుల్లో రిజర్వేషన్లు దాదాపు పూర్తయినందున, మళ్లీ అదనంగా బస్సులను యాజమాన్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యేక బస్సుల పర్యవేక్షణ కోసం అన్ని జిల్లా ముఖ్య కేంద్రాలు, హైదరాబాద్‌లోని వివిధ పాయింట్ల వద్ద అధికారులు, సిబ్బందిని ఏపీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ఏర్పాటు చేసింది.

ప్రైవేట్ దోపిడీకి నియంత్రణ ఏది?

ఆర్టీసీ ఆదాయాన్ని ప్రైవేట్ యాజమాన్యం మరోసారి తన్నుకుపోయేందుకు సిద్ధమైనప్పటికీ, నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. సంక్రాంతి సందర్భంగా అధికంగా తెలుగు రాష్ట్రాల్లో విజయవాడ- హైదరాబాద్ మధ్య ఆర్టీసీ బస్సులు నడుస్తాయి. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయలేకపోవడంతో ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టర్ల దోపిడీ పెరుగుతోంది. విజయవాడ-హైదరాబాద్‌కు రూ.1500 నుంచి రూ.2వేల వరకు ఇష్టానుసారంగా రేట్లు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఆంధ్రా నుంచి ఇతర రాష్ట్రాలకూ వెళ్లే ప్రైవేట్ బస్సుల టికెట్లకు భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారు. ఏటా సంక్రాంతికి ఇదే సమస్య ఎదురవుతున్నప్పటికీ, ఆర్టీసీ యాజమాన్యం ముందస్తు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. కేవలం ప్రత్యేక బస్సులను మాత్రమే ఏర్పాటు చేసి, చేతులు దులుపుకుంటోందని ప్రయాణికులు మండిపడుతున్నారు. అటు రైళ్లల్లోనూ సంక్రాంతితో భారీగా ముందస్తు రిజర్వేషన్లు చేయించుకున్నారు. దీంతో బెర్తుల కొరత తీవ్రంగా ఉంది. బస్సులు, రైళ్లల్లో వెళ్లేందుకు అవకాశం లేని వారంతా గత్యంతరంలేని పరిస్థితుల్లో ప్రైవేట్ బస్సులను ఆశ్రయిస్తున్నారు. దీనిని అదునుగా తీసుకుని భారీగా టికెట్ల ధరలను నిర్ణయిస్తున్నారు. ప్రైవేట్ బస్సులు, వాహనదారుల ఆగడాలను నియంత్రించేందుకుగాను ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఏపీఎస్‌ఆర్టీసీ సర్వీసులను పెంచాల్సిన అవసరముందని అభిప్రాయపడుతున్నారు.

బార్లు...బార్లా !

(మొదటిపేజీ తరువాయి)

మందు అమ్మకాలు అర్ధరాత్రి 12గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్లు, హోటళ్లు, ఈవెంట్లు నిర్వహించే సంస్థలకు రాత్రి ఒంటిగంట వరకు అనుమతి ఇచ్చింది. డిసెంబరు 31వ తేదీతో పాటు జనవరి 1వ తేదీ కూడా రెండు రోజులపాటు వైన్ షాపుల్లో అర్ధరాత్రి వరకు, బార్లలో ఒంటిగంట వరకు మద్యం విక్రయాలు చేసుకునే అవకాశం కల్పించింది. దీంతో మద్యం అమ్మకాలు గణనీయంగా పెరగనున్నాయి. ఇదే సమయంలో కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా అక్రమ మద్యం, విక్రయాలపై దృష్టి పెట్టాలని, ముఖ్యంగా పొరుగు రాష్ట్రాల సరిహద్దులో పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని ఆబ్కారీశాఖను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ ఆదాయంపైనే ఎక్కువగా ఆధారపడిన విషయం తెలిసిందే. దీంతో నూతన సంవత్సర వేడుకలను సొమ్ము చేసుకునే లక్ష్యంతోనే గతంలో ఎన్నడూలేని విధంగా రాత్రి ఒంటిగంట వరకు బార్లకు అనుమతిచ్చింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మద్య నిషేధం విధిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొత్త సంవత్సరం పేరుతో మద్యాన్ని ఏరులైపారిస్తున్నారు. దీనిపై మహిళా సంఘాల నేతలు మండిపడుతున్నారు.

త్వరలో కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ?

(మొదటిపేజీ తరువాయి)

మార్పులు చేర్పులకు మోదీ ప్రభుత్వానికి ఇదే చివరి అవకాశంగా భావించొచ్చు. 2023లో కర్ణాటక, తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ తదితర తొమ్మిది రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో బీజేపీకి రాజకీయంగా లబ్ధి చేకూర్చేలా మంత్రివర్గంలో మార్పులు ఉండేందుకు అవకాశం ఉంది. మంత్రుల పనితీరును బట్టే కాకుండా.. అర్హులైన ఎంపీలకు మంత్రివర్గంలో చోటు కల్పించడానికి.. మంత్రివర్గం నుంచి బయటకొచ్చిన వారిని పార్టీ సంస్థాగత పని కోసం వాడుకోవడాన్ని బట్టి కూడా కేబినెట్ ప్రక్షాళన ఉండనుంది. 2022 జూన్ 8న ముఖ్యమైన నేతలుగా పేరొందిన వారు సహా 12 మంది మంత్రులను మార్చారు. ఈసారి కూడా కేబినెట్లో మార్పులు అదే తరహాలో ఉంటాయనే అంచనాలు ఉన్నాయి. లోక్‌సభ ఎంపీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు కీలక బాధ్యతలను కూడా కట్టబెడతారని భావిస్తున్నారు. గుజరాత్ నుంచి మరికొందరిని కేబినెట్‌లోకి తీసుకొచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ విషయమై రాష్ట్రాల నాయకులు, పార్టీ కీలక నేతలతో పార్టీ అధినాయకత్వం ఇప్పటికే అనేకసార్లు చర్చలు జరిపింది. ఎంత మంది మహిళలకు, రిజర్వ్ కేటగిరీలకు చెందిన వారికి కేబినెట్లో అవకాశం కల్పించాలనే విషయాన్నీ చర్చించారని తెలుస్తోంది. ఎవరెవర్ని కేబినెట్లోకి తీసుకోవాలనే విషయమై ఇప్పటికే అగ్రనేతలు ఓ నిర్ణయానికి వచ్చారని తెలుస్తోంది. ఇదిలావుంటే, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో ఆ రాష్ట్రానికి కూడా ప్రాధాన్యం దక్కే అవకాశం ఉంది. బీజేపీకి తెలంగాణ నుంచి నలుగురు ఎంపీలు ఉండగా కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా ఉన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. దీంతో కాపు సామాజికవర్గానికి చెందిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, ఆదివాసీ ఎంపీ సోయం బాపూరావుల్లో ఒకరికి కేంద్రమంత్రి పదవి దక్కే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

పనికిరాని మిషన్లు

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతోందని, పర్యవసానంగా 2022 జూన్ వరకు పెండింగ్ కేసుల సంఖ్య 3.14లక్షలు దాటిందని ఎస్ఎన్ఎస్ నివేదిక వెల్లడించింది. త్రిపుర, జార్ఖండ్ రాష్ట్రాల సమాచార కమిషన్లు నిర్వీర్యమైనట్లు నివేదిక తెలిపింది. సరిపడ సిబ్బంది లేక కమిషన్లు సక్రమంగా పనిచేయని కారణంగా ఆర్టీఐ పనితీరు దెబ్బతింటోందని వెల్లడించింది.

2022, అక్టోబరు 12 వరకు వచ్చిన సమాధానాలను నివేదికలో అంజలీ భరద్వాజ్, అమృతా జోహ్రీ ప్రస్తావించారు. 2021 జులై నుంచి 2022 జూన్ వరకు ప్యానళ్ల పనితీరుపై నివేదిక ఇందులో ఉన్నది. దేశవ్యాప్తంగా ఉన్న సమాచార కమిషన్ల పనితీరును మెరుగుపడాలని, వ్యవస్థ ఆర్టీఐ ఆధ్వర్యంలో మరింత బలోపేతం కావాలన్న ఉద్దేశంతోనే నివేదికను రూపొందించినట్లు ఎస్ఎన్ఎస్ తెలిపింది. 2019లో జరిగిన చట్ట సవరణలు, కోవిడ్ మహమ్మారి ప్రభావం దృష్ట్యా సమాచార కమిషన్ల పనితీరును అధ్యయనం చేసినట్లు వెల్లడించింది.

అయితే కమిషన్లలో చాలా వరకు కమిషనర్లుగా ఉన్నది రిటైర్డ్ బ్యూరోక్రాట్లు అని నివేదిక తెలిపింది. మహిళలు పది శాతమే ఉన్నారని పేర్కొంది. సమాచార కమిషన్ల ఏర్పాటులో వైవిధ్యత లోపించిందని, ఒక్క మహిళా కమిషనర్ లేదని తెలిపింది. ఎలాంటి ఆదేశాలు జారీ చేయకుండానే పెద్ద సంఖ్యలో కేసులను కమిషన్లు తిప్పిపంపుతున్నాయని వెల్లడైందన్నారు. సీఐసీ, యూపీఎస్ఐసీ, ఆంధ్రప్రదేశ్ ఎస్ఐసీ నుంచి 40 వరకు అప్పీళు /ఫిర్యాదులు వచ్చినట్లు నివేదిక పేర్కొంది. కొన్ని కమిషనర్లు రోజుకు ఒక్క కేసును కూడా పరిష్కరించే పరిస్థితి లేదని తెలిపింది. పశ్చిమ బెంగాల్ ఎస్ఐసీని ఉదహరించింది. ఈ రాష్ట్ర ఎస్ఐసీ వార్షిక పరిష్కార రేటు కమిషనర్‌కు 222 కేసులు అని, పది వేలకుపైగా పెండింగ్ కేసులు ఉన్నాయని నివేదిక తెలిపింది. కేవలం కేంద్ర సమాచార కమిషన్లలో కాస్త మెరుగైన పరిస్థితి ఉన్నదని పేర్కొంది. ఈ ఏడాది అక్టోబరులో 29 కమిషన్లపై విడుదల చేసిన ప్రగతి నివేదికలో గతేడాదితో పోల్చితే 50వేల కేసులు పెండింగ్ ఉన్నట్లు వెల్లడించింది. బ్యాక్‌లాగ్‌లు పేరుకుపోతున్నట్లు తెలిపింది. రెండు కమిషన్లు పని చేయకపోగా మరో నాలుగు కమిషనర్లకు చీఫ్‌లు లేరని నివేదిక వెల్లడించింది. నాటి నుంచి నేటి వరకూ జార్ఖండ్, త్రిపుర సమాచార కమిషన్ల పరిస్థితి మారలేదని తెలిపింది. మణిపూర్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ ఎస్ఐసీలకు ప్రధాన సమాచార కమిషనర్ లేరని పేర్కొంది. ఖాళీలు ఏర్పడినప్పుడు సమయానికి నియామకాలు జరగడం లేదని తెలిపింది. గతేడాది 26 కమిషన్లలో పెండింగ్ కేసులు 2,55,602 కాగా ఈ ఏడాది జూన్‌కి వాటి సంఖ్య 3,14,323కి చేరిందని పేర్కొంది. దాదాపు 95శాతం కేసుల్లో జరిమానాలు నామమాత్రంగానే సమాచార కమిషన్లు విధించినట్లు నొక్కిచెప్పింది. గతేడాది ఇదే పరిస్థితని గుర్తుచేసింది.

వలంటీర్ల 'వారం'తిప్పలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి ఏటా పెంచుకుంటూ పోతామని చెప్పిన జగన్, ఆచరణలో తీవ్ర జాప్యం చేశారు. దానివల్ల ప్రస్తుతం రూ.3వేలు అందజేయాల్సి ఉండగా, ఆలస్యం వల్ల జనవరి నుంచి రూ.2,750 అందజేయనున్నారు. కొత్తవారితో కలిపి ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వృద్ధులు, వితంతువులు, చేనేత, కల్లు గీత కార్మికులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, చర్మకారులు, దివ్యాంగులు, హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు అందరూ కలిపి 64.06లక్షల మంది లబ్ధిదారులుండగా, వీరికి రూ.1,765 కోట్లు చెల్లించనున్నారు.

కొలువుల జాతర...

మరో మూడు నోటిఫికేషన్లు జారీ

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో ఉద్యోగాల ఖాళీల భర్తీ కోసం నోటిఫికేషన్లు వరుసగా విడుదలవుతున్నాయి. ఇప్పటికే గ్రూప్స్, పోలీస్, వైద్యారోగ్యశాఖ తదితర శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు విడుదలైన విషయం తెలిసిందే. శనివారం మరో మూడు నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. కళాశాల విద్యాశాఖలో 544 ఉద్యోగల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. డిగ్రీ లెక్చరర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 20వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. మే లేదా జూన్‌లో నియామక పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొంది. విద్యాశాఖలో మరో 71 పోస్టులకు టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ వెలువరించింది. ఇంటర్ కమిషనరేట్‌లో 40 లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. సాంకేతిక విద్యాశాఖలో 31 లైబ్రేరియన్ పోస్టులను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు పేర్కొంది. జనవరి 21వ నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి, మే లేదా జూన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖలో అకౌంట్స్ ఆఫీసర్ 78 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో అత్యాధునిక 14 పడకల ఎమర్జెన్సీ వార్డు

ప్రారంభించిన సంస్థ చైర్మన్ నందమూరి బాలకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో అత్యాధునిక సదుపాయాలతో కూడిన 14 పడకల ఎమర్జెన్సీ వార్డును శనివారం సంస్థ చైర్మన్ నందమూరి బాలకృష్ణ ప్రారంభించారు. ఆసుపత్రికి అత్యవసర పరిస్థితులలో వచ్చే రోగులకు ఈ నూతన వార్డు ఎంతగానో ఉపయోగపడనుంది. గతంలో 7 పడకలతో ఉన్న ఎమర్జెన్సీ వార్డు స్థానంలో ఈ నూతన వార్డు ఏర్పాటయింది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఇక్కడకు వచ్చే రోగులకు స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆశించినట్లు పేద ప్రజలకు అందుబాటు ధరలలో అత్యాధునిక వైద్య సదుపాయాలు అందించాలనే లక్ష్యాన్ని సాధించే దిశగా ఈ వార్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. త్వరలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రేడియేషన్ యంత్రంతో పాటు రెండవ పెట్ సిటీ స్కానింగ్ యంత్రాన్ని కూడా పేషెంట్లకు అందుబాటులోనికి తీసుకు రానున్నట్లు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు స్వాంతన కలిగించడానికి వైద్యులు, సిబ్బంది విశేష కృషి చేస్తున్నారని, దానికి గుర్తింపుగా సంస్థకు ఎన్నో అవార్డులు అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. నానాటికీ పెరుగుతున్న ఈ మహమ్మారి నివారణకు సంబంధించిన అంశాలపై పరిశోధనలు చేయడానికి ప్రత్యేక పరిశోధనా విభాగం కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. దీంతో పాటూ రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రజలలో క్యాన్సర్ పై అవగాహన కలిగించడానికి కూడా సంస్థ ఎన్నో ప్రత్యేకమైన అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్ క్యాంపులు కూడా నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డా. గడ్డం దశరధరామి రెడ్డి, ట్రస్టు బోర్డు సభ్యులు, డా. ఆర్.వి.ప్రభాకర రావు, డా. టియస్ రావు, మెడికల్ డైరెక్టర్ డా. ఫణి కోటేశ్వర రావు, మెడికల్ సూపరింటెండెంట్ డా. కల్పనా రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవి ప్రజావ్యతిరేక విధానాలు

జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలి

జంగాల అజయ్‌కుమార్ డిమాండ్

విశాలాంధ్ర-నరసరావుపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గం సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం పార్టీ కార్యాలయంలో జరిగింది. జంగాల అజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై సీపీఐ అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎల్ఐసీ, రైల్వేలు, విమానాలు, ఓడ రేవులు, జీఐసీ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీ రిలయన్స్ లాంటి గుప్త పెట్టుబడిదారులకు అప్పజెప్పటాన్ని సీపీఐగా తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రానున్న కాలంలో కార్మికులు, రైతులు, పేదల పక్షాన సీపీఐ అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తుందని, ఆ పోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా పోరాడేందుకు జనవరి 26న పెద్ద ఎత్తున సీపీఐ కార్మిక సంఘం అధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కార్మికులందరూ ఒక తాటి మీదకు రావాలన్నారు. మరోపక్క జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక హోదా, విభజన హామీలు, రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు, వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు నిధులు సాధించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు. అదేవిధంగా టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీలకు తక్షణమే నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించాలని,

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలని, జగనన్న కాలనీలకు ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ అధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేసి, విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏరియా కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణ రాజు, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉప్పలపాటి రంగయ్య, నాయకులు జె.హల్దా, ఎస్.దేవి, శిరీష, జి.హర్ష, జి.నాగరాజు, సురేష్, పున్నయ్య, అంకారావు, బ్రహ్మయ్య, యాకోబు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి రైతు మృతి

విశాలాంధ్ర- పెద్దకడబూరు: ఉమ్మడి కర్నూలు జిల్లా పెద్దకడబూరు మండల పరిధిలోని కొత్త గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన బోయ గోపాల్ (27) అప్పుల బాధతో పురుగు మందు తాగి శనివారం మృతి చెందారు. గోపాల్ వ్యవసాయంతో బాగా నష్టపోయాడని, నాలుగేళ్లలో 4 లక్షల రూపాయలు అప్పు చేశాడని తండ్రి ఉరుకుంద చెప్పాడు. అప్పు ఎలా తీర్చాలో అర్థం కాక మనస్థాపానికి గురై గోపాల్ పురుగు మందు తాగాడని తెలిపాడు. మెరుగైన వైద్య కోసం కర్నూలు, తిరుపతి తరలించిన ఫలితం కనిపించలేదని తండ్రి కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రాజోలి రిజర్వాయర్ పనులు ప్రారంభించాలి

సీపీఐ, రైతుసంఘం బృందం డిమాండ్

విశాలాంధ్ర-కడప రూరల్: కుందూనదిపై 2.95 టీఎంసీలతో నిర్మించే రాజోలి రిజర్వాయర్ ప్రాజెక్టు సామర్థ్యాన్ని తగ్గించవద్దని, దీని పనులు వెంటనే ప్రారంభించాలని సీపీఐ వైఎస్ఆర్ కడప జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కోరారు. సీపీఐ, ఏపీ రైతుసంఘం బృందం శనివారం రాజోలి రిజర్వాయర్‌ను పరిశీలించింది. అనంతరం గాలి చంద్ర మాట్లాడుతూ కేసీ కెనాల్‌కు కృష్ణానది నుండి 39 టీఎంసీల నికరజలాలు కేటాయించగా తుంగభద్ర నుండి పీఏబీఆర్‌కు పది టీఎంసీలు, శ్రీశైలం నుండి 10 టీఎంసీలు కేసీ కెనాల్ ఆయ కట్టుకు అందించేందుకు రాజోలి ఆనకట్ట వద్ద 2.9 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం కోసం 2008లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శిలాఫలకం వేశారన్నారు. నిధులు కేటాయించకపోవడం వలన ఆ రిజర్వాయర్ పనులు ప్రారంభం కాలేదన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో మరో శిలాఫలకం వేసి రిజర్వాయర్ నిర్మాణానికి రూ.1300 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారన్నారు. అయితే భూములు, ఊర్లు, ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం ఇంకా ఇవ్వలేదన్నారు. పరిహారం కోసం కొంతమంది రైతులు కడప కలెక్టర్ కార్యాలయానికి వెళ్లగా... జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూల సుధీర్‌రెడ్డి ముందుగా వెళ్లి రిజర్వాయర్ ఎత్తును 2.9 టీఎంసీల నుండి 1.2కు తగ్గించాలనే ప్రతిపాదన కలెక్టర్ ముందు పెట్టారని, ఇది సరికాదని చంద్ర అన్నారు. రిజర్వాయర్ సామర్థ్యం తగ్గించడం వలన ఈ ప్రాంత రైతాంగానికి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. కడప జిల్లా సస్యశ్యామలంగా ఉండాలని ఊరిని, భూమిని త్యాగం చేస్తున్నా రిజర్వాయర్ సామర్థ్యం తగ్గించాలన్న ప్రతిపాదన ఎమ్మెల్యే ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. రైతులకు పరిహారం అడిగితే ఎమ్మెల్యే అనుచరులు దాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు . రిజర్వాయర్ వలన కలిగే ప్రయోజ నాల గురించి రైతులకు నచ్చచెప్పి భూములు ఇప్పించాల్సిన ఎమ్మెల్యే... భౌతిక దాడు లకు పాల్పడటం దుర్మార్గమని చంద్ర విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ సుబ్బారెడ్డి, కొమ్మద్ది ఈశ్వరయ్య మాట్లాడుతూ రాజోలి రిజర్వాయర్ సామర్థ్యం తగ్గించడం వలన సకాలంలో కేసీ కెనాల్‌కు నీళ్లు రావన్నారు. ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, కడప నియోజక వర్గాలలోని కేసీ కెనాల్ ఆయకట్టు ప్రాంత రైతులకు తీవ్రనష్టం జరుగుతందన్నారు. తక్షణమే ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, కడప ఎమ్మెల్యేలతో పాటు జమ్మలమడుగు ఎమ్మెల్యే కూడా 2.95 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ పనులు ప్రారంభించేలా కృషి చేయాలన్నారు. లేకపోతే రైతులతో ఆందోళన చేపడతామని హెచ్చ రించారు. ఈ బృందంలో నాయకులు శ్రీరాములు, సురేశ్, శివరాం, షరీఫ్, హరి, ఏసోబు, ప్రమీల, సుజాత, పుల్లయ్య ఉన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమం

రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపు

విశాలాంధ్ర-మార్కాపురం: ఆంధ్ర రాష్ట్రానికే తలమానికమైన విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం జనవరి 22, 23, 24 తేదీలలో రెవెన్యూ కార్యాలయాల వద్ద జరిగే ఆందోళనల్లో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ కార్మికలోకానికి పిలుపునిచ్చారు. స్థానిక పూలసుబ్బయ్య శాంతి భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీంద్రనాథ్ మాట్లాడారు. జనవరి 25న కలెక్టరేట్‌ల వద్ద ఆందోళన, 27న విశాఖపట్నంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ జరుగుతుందని ఆయన చెప్పారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో పోరాట యోధులు, త్యాగధనుల కృషి ఫలితంగా విశాఖ ఉక్కు ఏర్పడిందని ఆయన గుర్తు చేశారు. పెద్దఎత్తున ఉక్కు ఉత్పత్తి చేస్తూ దేశంలోనే అగ్రగామి ప్రభుత్వ సంస్థగా ఉన్న విశాఖ ఉక్కును పెట్టుబడిదారులకు ధారాదత్తం చేయాలనే కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిరసనగా ఉద్యమం చేయడం మినహా మరో మార్గం లేదని ఆయన అన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత లాభాలతో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా బహుళజాతి సంస్థలకు విక్రయిస్తూ లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని దుయ్యబట్టారు. పాలకవర్గాల ప్రైవేటీకరణ విధానాల ఫలితంగా ప్రభుత్వ రంగ సంస్థలు మూతపడటంతో లక్షలాది మంది కార్మికులు జీవనోపాధి కోల్పోతున్నారని చెప్పారు. కార్మిక హక్కులకు భంగం కలిగించేలా మోదీ ప్రభుత్వం లేబర్‌కోడ్లు తీసు కొచ్చిందని, వీటికి వ్యతిరేకంగా ఉద్యమించాలని రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు.

తక్షణమే ఖాళీ పోస్టుల భర్తీ

రాజేంద్రబాబు, లెనిన్‌బాబు డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర బాబు, నక్కి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ప్రచురించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ని విజయవాడ దాసరిభవన్‌లో శనివారం విడుదల చేశారు. అనంతరం రాజేంద్ర, లెనిన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాల్సిందేనని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగం పెరుగుతున్నా పాలకులు మాత్రం మొద్దు నిద్ర నటిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన బీజేపీ మాట తప్పిందని మండిపడ్డారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌లకు కట్టబెడుతోందని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేస్తానని చెప్పి యువతను మోసం చేశారని విమర్శించారు. అఖిల భారత యువజన సమాఖ్య ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు, ఏఐఎస్ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎం.సాయి కుమార్, అయ్యప్ప, ఊటుకూరి సునీల్‌కుమార్, చీకటి వెంకట దేవిశ్రీ ప్రసాద్ పాల్గొన్నారు.

జగన్ ఆగడాలకు అడ్డుకట్ట వేద్దాం

జగదీశ్ పిలుపు

విశాలాంధ్ర-గుంతకల్లు: ముఖ్యమంత్రి జగన్ అప్రజాస్వామిక విధానాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వేదిక ఏర్పాటు చేసినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీశ్ చెప్పారు. గుంతకల్లు సీపీఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం ప్రజాస్వామ్య ఉద్యమాలను అణిచివేయడానికి ప్రయత్నిస్తున్నదని జగదీశ్ విమర్శించారు. ప్రతిపక్ష పార్టీల నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నదన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న వామపక్షాలను అణచివేయడానికి గృహ నిర్బంధాలు, అరెస్టులు వంటి అప్రజాస్వామిక చర్యలకు దిగుతోందని మండిపడ్డారు. టీడీపీ నేత నారా లోకేశ్ పాదయాత్రను అడ్డుకుంటామని మంత్రి నాగార్జున చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాదయాత్రకు సైతం అనుమతివ్వలేదని విమర్శించారు. పెన్షన్లు, సంక్షేమ పథకాలు తొలగిస్తామని సామాన్యులను భయ భ్రాంతులకు గురిచేస్తున్నదని చెప్పారు. మొత్తంగా రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోం దని, దీనిని ఎదుర్కొనేందుకు అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు ఏకమై ప్రజాస్వామ్య పరిరక్షణ వేదికను ఏర్పాటు చేశాయని గుర్తుచేశారు. జగనన్న ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కేవలం రూ.1.80 లక్షలు మాత్రమే ఇస్తున్నదని, దీనివల్ల ఇంటి నిర్మాణం ఎలా పూర్తవుతుందని ప్రశ్నించారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం రూ.4.80లక్షలు ఇస్తున్నదని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో సీపీఐ ఉద్యమ కార్యాచరణను వివరించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, సహాయ కార్యదర్శి బి.మహేశ్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మండల కార్యదర్శి రాము రాయల్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి పీసీ కులయప్ప, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఈశ్వరయ్య, సీపీఐ నాయకులు మల్లయ్య, మురళీకృష్ణ, ఏఐఎస్ఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

5న మహాధర్నా జయప్రదం చేయండి

అఖిలపక్ష రైతు సంఘాల పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు: నకిలీ విత్తనాలు, అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏఐకే ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ చంద్రయ్య, ఏపీ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకులు మల్లికార్జున, తెలుగు రైతు సంఘం రాష్ట్ర నాయకులు కేశవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మిక కర్షక భవనంలో అఖిలపక్ష రైతు సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ఏపీ రైతుసంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, ఏపీ రైతు సంఘం జిల్లా సమితి కార్యదర్శి అధ్యక్షతన శనివారం జరిగింది. ప్రభాకర్ రెడ్డి, రామచంద్రయ్య మాట్లాడుతూ ఖరీఫ్‌లో వేసిన పత్తి పంట దిగుబడిరాక నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అత్యధికంగా పత్తి పంట సాగు చేసినట్లు తెలిపారు. గతేడాది పత్తికి ఎక్కువ ధర రావడం వలన ఈ ఏడాది పత్తి పంట వైపు రైతులు మొగ్గు చూపారని, దీన్ని అదనుగా చేసుకున్న కంపెనీలు నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టారన్నారు. దీనివలన పంట దిగుబడి రాక రైతులు విపరీతంగా నష్టపోయారని వివరించారు. ఈ సమస్యపై నెల రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. జనవరి 5న ధర్నా చౌక్‌లో జరిగే మహాధర్నాకు మూడు జిల్లాల నుండి రైతులు కదలి రావాలని విజ్ఞప్తి చేశారు. మహాధర్నాకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం నేత పి.మధు, టీడీపీ, ఇతర పార్టీల నాయకులు హాజరవుతారని చెప్పారు. నంద్యాల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రాజశేఖర్, అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, రాజారాంరెడ్డి, కర్నూలు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కె. వెంకటేశ్వర్లు, తెలుగు రైతు నాయకులు యుగంధర్, అయ్యన్న, నారాయణరెడ్డి, హరిబాబు, ఆదిశేషారెడ్డి, రైతు సంఘం నాయకులు ఆంజనేయులు, తాండ్రపాడు సర్పంచ్ బాలపీరా, కోటకొండ సూరి, బడే సాహెబ్, రామచంద్రుడు, సుబ్బరాయుడు, బి.శివశంకర్ రెడ్డి, పి.హను మంతు, మల్లయ్య, రైతు నాయకుడు కృష్ణారెడ్డి, రైతుస్వరాజ్య వేదిక జిల్లా కార్యదర్శి పోతుల శేఖర్, రైతుకూలీ సంఘం నాయకులు సుంకన్న, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అభ్యుదయవాది ప్రకాశ్ మృతి

విశాలాంధ్ర-అవనిగడ్డ: అభ్యుదయవాది, స్నేహశీలి మోదుమూడి వెంకట సూర్య ప్రకాశ రావు (68) శనివారం ఉదయం మృతిచెందారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన మోదుమూడి కుటుంబం జాతీయోద్యమం, కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పాత్ర వహించింది. ఆ స్ఫూర్తితో చిన్ననాటి నుంచి అభ్యుదయ భావాలు అలవర్చుకున్న సూర్యప్రకాశ్ (తాతయ్య) ప్రజోపయోగ పనులు చేసేవారు. అవనిగడ్డలో కాకతీయ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి ఎందరినో విద్యావం తులుగా తీర్చిదిద్దారు. ఆయన వద్ద విద్యాభ్యాసం చేసినవారు చాలా మంది ఉన్నత స్థితిలో ఉన్నారు. వ్యక్తిత్వ వికాసం, తోటివారికి సహాయ పడటం అనే అంశాల మీద అనేక ప్రసంగాలు చేసి అనేక మందిని చైతన్యవంతులను చేశారు. పెదనాన్న అమరజీవి మోదుమూడి శ్రీహరి రావు నుంచి అలవర్చుకున్న కమ్యూనిస్టు భావాలతో కడవరకు జీవించారు. సూర్య ప్రకాశ్ మృతికి అనేక మంది సంతాపాన్ని తెలిపారు.

లక్ష్యాల సాధనకు ప్రేరణ ఇవ్వాలి

రాష్ట్ర ప్రజలకు గవర్నర్, సీఎం నూతన సంవత్సర శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : నూతన సంవత్సరం-2023 శుభారంభం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. 'నూతన ఆంగ్ల సంవత్సరం ఆంధ్రప్రదేశ్ పౌరులందరికీ శాంతి, శ్రేయస్సు, ఉల్లాసం, సంతోషాలను అందించాలని కోరుకుంటున్నాను. నూతన సంవత్సరం ఉజ్వల భవిష్యత్తు కోసం ఎదురు చూడడానికి, కొత్త అవకాశాలను అన్వేషించడానికి, నూతన లక్ష్యాలను సాధించడానికి ప్రేరణనిస్తుంది' అని ఆకాంక్షిస్తున్నట్లు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, కొత్త సంవత్సరం ప్రతి ఇంటిలో ఆరోగ్యాన్ని, ఆనందాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం తన సంక్షేమ, అభివృద్ధి అజెండాను కొనసాగిస్తుందని సీఎం పునరుద్ఘాటించారు. రాబోయే రోజుల్లో అంతా మంచి జరగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

గ్రానైట్ బండరాయిపడి నలుగురి దుర్మరణం

విశాలాంధ్ర- మహబూబాబాద్: తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. గ్రానైట్ బండరాయి పడి నలుగురు దుర్మరణం చెందారు. కురవి మండలం అయ్యగారిపల్లెలో ఈ ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. లారీ లోడ్ నుంచి గ్రానైట్ బండరాయి ఆటోపై పడడంతోనే ఈ దుర్ఘటన జరిగినట్లు తెలుస్తోంది. నలుగురు అక్కడికక్కడే చనిపోయారు. కూలీ పనులు ముగించుకుని వాళ్లంతా ఇంటికి వస్తున్న సమయంలోనే ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మృతులంతా చిన్నగూడురు మండలం మంగోళిగూడెం వాసులుగా తెలుస్తోంది.

తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల కోసం భక్తుల తోపులాట

విశాలాంధ్ర-తిరుపతి : తిరుమల కొండపై విపరీతమైన రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తుతున్నారు. నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలకు భక్తులు పెద్ద సంఖ్యలో క్యూ కడుతున్నారు. కాగా, వైకుంఠ ఏకాదశి టికెట్ల కోసం భక్తుల ఎగబడుతున్నారు. క్యూలైన్లలోకి వెళ్లేందుకు భక్తుల మధ్య శనివారం తోపులాట చోటు చేసుకుంది. అలిపిరి భూదేవి కాంప్లెక్స్ దగ్గర పెద్దసంఖ్యలో భక్తులు చేరుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఇచ్చే టికెట్ల కోసం ఇప్పటికే భారీగా క్యూ కట్టారు. వైకుంఠ ఏకాదశి టోకెన్ల కోసం క్యూలైన్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, టికెట్ల జారీపై సరైన సమాచారం లేకపోవడంతో అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద తోపులాట చోటు చేసుకుంది. 10 రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనం కల్పించనున్న నేపథ్యంలో టీటీడీ తిరుపతిలో 9 చోట్ల 92 కౌంటర్లను ఏర్పాటు చేసింది. నాలుగున్నర లక్షల టోకెన్లు జారీ చేయాలని నిర్ణయించింది. ఈ టోకెన్లను ఆదివారం మధ్యాహ్నం నుంచి ఇవ్వాలని టీటీడీ నిర్ణయించింది. అయితే, భక్తులు ఒక రోజు ముందుగానే కౌంటర్ల వద్దకు చేరుకున్నారు. దాంతో అక్కడ విపరీతమైన రద్దీ నెలకొంది.

'తెలంగాణ చరిత్ర తొవ్వల్లో' గ్రంథం ఆవిష్కరణ

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ప్రొఫెసర్ శ్రీరామోజు హరగోపాల్ రచించిన 'తెలంగాణ చరిత్ర తొవ్వల్లో' పుస్తకాన్ని చరిత్రకారులు ప్రొ.యశ్వంత్ రామూర్తి ఆవిష్కరించారు. డెక్కన్ హెరిటేజ్ అకాడమి నిర్వహణలో పర్యావరణవేత్త, చరిత్ర కారుడు వేదకూమార్ అధ్వర్యంలో జరిగిన ఈ పుస్తాకావిష్కరణలో ప్రొ.సల్మా అహ్మద్ ఫరూఖీ, ప్రొ.అంజన్న, శ్రీరామోజు హరగోపాల్, చరిత్ర కారుడు హైదరాబాద్ యాదే బాతే ప్రెసిడెంట్ అనందర్ రాజ్ వర్మ, ప్రొ.రఘు, తెలంగాణ అకాడమి చైర్మన్ జూలూరు గౌరి శంకర్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ చరిత్ర తొవ్వల్లో పుస్తాకావిష్కారణ చేసిన ప్రొ.యశ్వంత్ రాముర్తి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలు భిన్నత్వంలో ఏకత్వం తరహాలో ఉంటాయని చేప్పారు. అందులో హైదరాబాద్ నగరానికి ఉన్న ప్రాముఖ్యత ఎంతో విశిష్టమైనదని చెప్పారు. ఈ నగరంపై మరిన్ని పరిశోధనలు చేసేందుకు ఈ పుస్తకం ఉపయోడపడుతుందని చేప్పారు.ప్రభుత్వం కూడ తెలంగాణ చరిత్రను, సంస్కృతులను పరిరక్షించేందుకు చాల కృషి చేస్తూందని, అందుకు ఈ పుస్తకం ఎంతో సహాయకారిగా ఉంటుందని అభిప్రాయ పడ్డారు. ఈ సందర్భంగా వేదకూమార్ మాట్లాడుతూ దక్కన్ ప్రాంతం పురాతన కాలం నుండి ఇటీవలి కాలం వరకు గొప్ప చరిత్రను కలిగి ఉంది. తెలంగాణ చరిత్రను, దక్కన్ సంస్కృతులను ప్రజలకు, పాలకులను దృష్టికి తీసుకువచ్చేందుకు కృషిలో భాగంగానే శ్రీరామోజు హరగోపాల్ రచించిన తెలంగాణ చరిత్ర తొవ్వల్లో పుస్తకమని అన్నారు. దక్కన్ ప్రాంతంలో ఉన్నా చారిత్రనేపథ్యాన్ని యూనెస్కో గుర్తింపు రావడం గర్వకారణమని చేప్పారు. దక్కన్ ప్రాంతం యొక్క గొప్ప సాంస్కృతిక చరిత్ర కలిగిన రాళ్ళు, స్మారక చిహ్నాలు, సరస్సులు, సహజ వనరులను భవిష్యత్ తరాల కోసం సంరక్షించాల్సిన అవసరం గురించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రొ.సల్మా మాట్లాడుతూ.. డెక్కన్ చరిత్రను తెలుసుకునేందుకు కళాఖండాలు, పురావస్తు శాస్త్రం, శాసనాలు, చాలా ముఖ్యమైన భౌతిక ఆధారాలు, గతాన్ని పునర్నిర్మించడానికి రాష్ట్ర చరిత్రలో భాగాలు అని ఆమె అన్నారు. చారిత్రక అనావాళ్లను నిక్షిప్తం చేస్తూ ఈ పుస్తకరూపంలోకి రావడం సంతోషకరమని చెప్పారు.ఆమె ఈ పుస్తకాన్ని వివిధ భాషలను తీసుకురావాలని సూచించింది. ప్రొ.అంజన్న మాట్లడుతూ.. తెలంగాణ చరిత్ర అంటే హైదరాబాద్ చరిత్రే అన్నారు.ఇందులో 21 ఆర్టికల్స్ 18 శాసనాలు ఉన్నాయని చేప్పారు.సాధారణ ప్రజలకు, విద్యార్థులను చాల ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా అనంద్ రాజ్ మాట్లాడుతూ హైదరాబాద్ అంటే పాతబస్తీ మకరందమని చేప్పారు. మరుగున పడిపోతున్నా మన దక్కన్ చరిత్ర, మన హైదరాబాద్ చారిత్ర మన ఆనవాల్లను పైకి తీసుకు వస్తూన్నందుకు వేదకుమార్ కు ప్రొ.రామోజు హరగోపాల్ అభినందించారు. ఈ సందర్భంగా జూలూరు గౌరి శంకర్ మాట్లాడుతూ.. తెలంగాణ చరిత్ర రాసేందుకు చారిత్రక దారులు వేస్తూన్న పుస్తకమని అన్నారు. శ్రీరామోజు హరగోపాల్ తెలంగాణ యొక్క గొప్ప చరిత్ర, దాని డాక్యుమెంటేషన్ అవసరాన్ని గురించి మాట్లాడారు. పుస్తకంలోని ముఖ్యమైన అంశాలపై డాక్టర్ ఎస్.రఘు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో డెక్కన్ హెరిటేజ్ అకాడమీ కో ఆర్డినేటర్ కట్టా ప్రభాకర్ కవులు, రచయితలు, స్వచ్ఛంద సంస్థలు, దక్కన్ హెరిటేజ్ అకాడమీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్షన్లు, అమ్మఒడిలో కోతలు ఆపాలి

- 2న రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాల వద్ద ధర్నాలు
- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పెన్షన్లు, అమ్మఒడి వంటి సంక్షేమ పథకాల్లో భారీ కోతలు విధిస్తున్నారని, వీటిని ప్రభుత్వం తక్షణమే ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ కార్యవర్గ సమావేశం సుదీర్ఘంగా చర్చించి చేసిన తీర్మానాలను శ్రీనివాసరావు మీడియాకు విడుదల చేశారు. సంక్షేమ పథకాలు, నవరత్నాల క్రింద పంపిణీ చేస్తున్న సహాయంలో కోత వల్ల ప్రజలకు అందాల్సిన పూర్తి ప్రయోజనాలు అందడం లేదు. పింఛనుదారుల పేర్లతో ఆస్తులు ఉన్నట్లు తప్పుడు రికార్డులు చూపించడం, సెంటు, సెంటున్నర ఉన్న భూములను కూడా విస్తీర్ణం పెంచి నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. 300 యూనిట్ల కరెంటు వాడకం ఉంటే పెన్షన్ ఇవ్వబోమని అంటున్నారు. కుటుంబంలో ఒకరు ఏదో ఒక లబ్ధి పొందుతున్నారని, వికలాంగులకు పెన్షన్ కోత పెట్టడం అన్యాయం. ప్రభుత్వాన్ని విమర్శించారని, ఓటు వేయలేదని, మరొక పార్టీకి చెందిన వారనీ కక్ష సాధింపులతో వేధించడానికి పెన్షన్లు, సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని బెదిరించడం పరిపాటిగా మారింది. అమ్మఒడి లబ్దిదారులకు కూడా షరతులు పెట్టి 3.5 లక్షల మందికి కోత విధించారు. ట్యాబ్‌ల పంపిణీ పేరుతో మరో 5 లక్షల మందిని తగ్గిస్తున్నారు. అమ్మఒడి డబ్బులతో ట్యాబ్‌లు కొని కంపెనీలకు ప్రజాధనాన్ని కట్టబెడుతున్నారు. వీటన్నింటివల్ల రానున్న కాలంలో సంక్షేమానికి పెద్ద దెబ్బ తగులుతుందని కార్యవర్గం ఆందోళన వ్యక్తం చేసింది. రేషన్ డిపోలలో సంక్రాంతి సందర్భంగా బియ్యంతో పాటు పండుగ సరుకులు పంపిణీ చేయాలని, జగనన్న ఇళ్లకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు నవరత్నాలకు మళ్లించకుండా దళిత వాడల అభివృద్ధికే ఖర్చు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. పెన్షన్లు, ప్రజాపంపిణీ, సంక్షేమ పథకాల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 2వ వారంలో సచివాలయాల వద్ద రాయబారాలు, ధర్నాలు నిర్వహించాలని కార్యవర్గం నిర్ణయించింది.

సంపాదకీయం

చక్రం తిప్పుతున్న బీజేపీ

మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న బీజేపీ నాయకుడు తన పార్టీ అసలు స్వరూపాన్ని బయట పెట్టారు. మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రే మీద విరుచుకు పడ్డారు. ఉద్ధవ్ ఠాక్రే కళ్ల ఎదురుగా నుంచే 50 మంది ఎమ్మెల్యేలను తీసుకెళ్లాం చూడండి అని కడుపులో ఉన్న మాట బయట పెట్టారు. ఎన్నికలలో ప్రజల తీర్పును అంగీకరించే అలవాటు మోదీ హయాంలో బీజేపీకి ఎప్పుడూ లేదు. అనేక రాష్ట్రాలలో మెజారిటీ లేకపోయినా ఇతర పార్టీల ఎమ్మెల్యేలకు ఎరవేసి దొడ్డిదారిన ప్రభుత్వాలు ఏర్పాటుచేసిన ప్రజాస్వామ్య వ్యతిరేక లక్షణాన్ని నరనరాన జీర్ణించుకున్న బీజేపీ తత్వం ఏమిటో దేవేంద్ర ఫడ్నవీస్ మాటల్లో స్పష్టం అవుతోంది. మీకే కాదు మీ "అబ్బకు కూడా భయపడం" అని తెగేసి చెప్పారు. ఇలాంటి భాష మర్యాదకరమైంది కాదని కూడా ఆయన గ్రహించలేదు. తమ ప్రభుత్వాన్ని పడగొడితే ముంబై మొత్తం దగ్ధమవుతుంది అని ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు అన్నమాటను ప్రస్తావిస్తూ దగ్ధం కాకపోగా ఎక్కడా ఒక్క అగ్గి పుల్ల కూడా వెలగలేదు అని ఫడ్నవీస్ అన్నారు. ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేన వర్గాన్ని నామరూపాలు లేకుండా చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా విసిరిన సవాలును అమలుచేసే పనిలో ఫడ్నవీస్ తలమునకలై ఉన్నారని ఆయన దూకుడు వైఖరే నిరూపిస్తోంది. మహారాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు శుక్రవారం నిరవధికంగా వాయిదాపడిన తరవాత ఫడ్నవీస్ చేసిన వ్యాఖ్యలు బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఏ మేరకు కుళ్లబొడవగలుగుతుందో నిరూపించే ప్రయత్నం చేశారు. శ్రీ సిద్ధి వినాయక ట్రస్ట్‌లో జరిగిన అవకతవకలపై విచారణ త్వరలో పూర్తవుతుందని ఉద్ధవ్ ఠాక్రే వర్గాన్ని భయపెట్టడానికి ప్రయత్నించారు. తదుపరి శాసనసభ సమావేశం ఫిబ్రవరి 27న ప్రారంభంఅయ్యే సూచనలు ఉన్నాయి. శివసేనలోని ఉద్ధవ్, షిండే వర్గాలమధ్య ఆధిపత్యపోరు కొనసాగుతోంది. ఈ జగడం బుధవారం బృహన్ముంబై మునిసిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో వికృత రూపంలో వెల్లడైంది. శివసేన కార్యాలయాన్ని స్వాధీనం చేసుకోవడానికి శివసేనలోని రెండువర్గాలు పోటీ పడ్డప్పుడు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు కలగజేసుకుంటే తప్ప పరిస్థితి అదుపులోకి రాలేదు. శివసేన పార్టీ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకోవడానికి రెండువర్గాలు భీకర ప్రయత్నాలు చేస్తున్నాయి. ముఖ్యమంత్రి పదవిని ఆక్రమించిన శివసేన చీలికవర్గం నాయకుడు ఏక్‌నాథ్ షిండేవి దిష్టి కళ్లు, ఆయన ఆర్.ఎస్.ఎస్ కార్యాలయాన్నే స్వాధీనం చేసుకుంటారు జాగ్రత అని ఉద్ధవ్ ఠాక్రే ఆర్.ఎస్.ఎస్. అధినేత మోహన్ భగవత్‌ను హెచ్చరించారంటే వీరి వైరం ఎంతదాకా వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యమంత్రి షిండే, ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ నాగపూర్‌లోని ఆర్.ఎస్.ఎస్. వ్యవస్థాపకుడు హెడ్గేవార్ స్మృతి మందిరాన్ని సందర్శించారు. ఆర్.ఎస్.ఎస్ సిద్ధాంతవేత్త ఎం.ఎస్.గోల్వాల్కర్ స్మృతి కేంద్రంవద్ద కూడా షిండే, ఫడ్నవీస్ నివాళులు అర్పించారు. దీన్ని దృష్టిలో ఉంచుకునే ఉద్ధవ్ ఠాక్రే ఈ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఈ ఇద్దరు నాయకులు ఆర్.ఎస్.ఎస్ పదాధికారులతో కూడా సమావేశమయ్యారు. ఏ వ్యవస్థనూ నిర్మించలేనివారు ఉన్న వ్యవస్థను దొడ్డిదారిలో చేజిక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నది ఉద్ధవ్ ఠాక్రే ఆరోపణ.

మొత్తం 288 స్థానాలున్న మహారాష్ట్ర శాసనసభలో మిగతా అన్ని పార్టీలకన్నా ఎక్కువగా బీజేపీకి 106మంది సభ్యులున్నారు. కాంగ్రెస్, శివసేన, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్.సి.పి)తో కూడిన మహావికాస్ అగాఢీ ప్రభుత్వం గత జులైలో పతనమైంది. ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి బీజేపీతో కలిసి ఏక్‌నాథ్‌షిండే ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన వర్గంలో ఇప్పుడు 40 మంది ఉన్నారు. ఉద్ధవ్ ఠాక్రే వర్గంలో 17మంది మాత్రమే మిగిలారు. మరి ఫడ్నవీస్ చెప్తున్నట్టు 50మంది సభ్యులను ఎలా లాక్కెళ్లారో తెలియదు. ఉద్ధవ్‌ఠాక్రే నాయకత్వంలోని ప్రభుత్వాన్ని పడగొట్టడమే ఏక్‌నాథ్ షిండే లక్ష్యం కనక బీజేపీకి 106 సీట్లు ఉన్నప్పటికీ షిండేనే ముఖ్యమంత్రి అయిపోయారు. దీన్నిబట్టి బీజేపీ వెనకనుంచి ప్రభుత్వాన్ని నడిపిస్తుందన్న విమర్శ ఆ రోజుల్లోనే వచ్చింది. ఇప్పుడు ప్రభుత్వం కాస్త కుదుటబడిన తరవాత బీజేపీ నాయకుడు ఫడ్నవీస్ తన అసలు స్వరూపాన్ని బయటపెట్టి హెచ్చరికలకు దిగుతున్నారు. ముఖ్యమంత్రి కావడానికి ఎమ్మెల్యేలను తీసుకెళ్లి ఇతర రాష్ట్రాలలో శిబిరాలు ఏర్పాటు చేయడంలాంటి విద్యలన్నీ షిండే ప్రదర్శించారు. ఇప్పుడు శాసనసభ్యుల బలంరీత్యా చూస్తే ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని వర్గం ఘోరమైన మైనారిటీలో పడిపోయింది. ఆ వర్గాన్ని ఉద్ధవ్ బాలాసాహెబ్ వర్గం అంటున్నారు. షిండే నాయకత్వంలోని వర్గాన్ని బాలాసాహెబ్ శివసేన అంటున్నారు. వెరసి బాలా సాహెబ్ ఠాక్రే వారసత్వం ఎవరిది అని జగడం నడుస్తోంది. ఈ తంపులు పెట్టింది బీజేపీ అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఉమ్మడి శివసేన ఎన్నికల చిహ్నమైన విల్లంబుల గుర్తుకోసం రెండువర్గాలూ తలపడ్తున్నాయి. శివసేన శాసనసభ శీతాకాల సమావేశాలు నాగపూర్‌లో జరిగాయి. ఆ సందర్భంగానే షిండే, ఫడ్నవీస్, ఆర్.ఎస్.ఎస్ నాయకులతో భేటీ అయ్యారు. ముంబైలోని బృహన్ముంబై కార్యాలయం మీద ఆధిపత్యంకోసం షిండే వర్గం తీవ్రప్రయత్నం చేస్తోంది. బీజేపీ షిండేకు దన్నుగా ఉంది. ముంబైని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చాలని కుట్ర పన్నుతున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. శివసేనలోని రెండువర్గాల ఆధిపత్య పోరాటంలో కర్నాటకకు, మహారాష్ట్రకు మధ్య ఉన్న తగాదాలను కూడా పరస్పరారోపణలకు ఉపయోగించుకుంటున్నారు. ఈ గొడవలో మహారాష్ట్ర గవర్నర్ బి.ఎస్.కోషియార్ రాజీనామా చేయాలని కూడా ఉద్ధవ్ ఠాక్రే గట్టిగా కోరుతున్నారు. కోషియారీ మహారాష్ట్ర ప్రజలకు ఆదరణీయులైన నాయకులను అవమానించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉద్ధవ్ అధికారంలో ఉన్నప్పుడు కూడా కరోనా విలయతాండవం చేస్తున్న సమయంలో దేవాలయాలను తెరిపించాలని కోరి గవర్నర్ కోషియారీ వివాదాలకు తెరలేపారు. ఛత్రపతి శివాజీని, సావిత్రీబాయి ఫూలేను, మహాత్మాఫూలేను కించపరుస్తూ మాట్లాడిన కోషియారీకి గవర్నర్‌గా కొనసాగే హక్కు లేదని ఉద్ధవ్ ఠాక్రే అంటున్నారు. కర్నాటక, మహారాష్ట్ర మధ్య రగులుతున్న వివాదం కూడా శివసేనవర్గాల మధ్య వైరానికి ఆజ్యం పోయడం బాధాకరం. కర్నాటకలో అధికారంలో ఉన్నది బీజేపీ ప్రభుత్వమే. మహారాష్ట్రలోనూ బీజేపీ ప్రభుత్వంలో భాగస్వామే. అయినా రెండు రాష్ట్రాల మధ్య వివాదం తారస్థాయికి చేరడం సైతం బీజేపీ రాజకీయ పన్నాగంలో భాగమే అనుకోవాలి. ఏమైనప్పటికీ బీజేపీ ఇప్పటిదాకా తెరవెనక ఉండి నాటకం నడిపిస్తే ఫడ్నవీస్ ప్రకటనతో ఇప్పుడు బాహాటంగానే షిండేను తోలుబొమ్మనుచేసి బీజేపీ చక్రం తిప్పుతోందని రూఢి అవుతోంది.

శతాబ్దపు మంచు తుఫాను గుప్పిట్లో అమెరికా, కెనడా

ఒకవైపు చైనాలో బియఫ్-7 వేరియంట్ కల్లోలం, మరో వైపు తీవ్రమైన శీతాకాలపు తుఫాను గుప్పిట్లో ఉత్తర అమెరికా, కెనడాలు అతలాకుతలం అవుతున్న వార్తలు ప్రపంచ మానవాళిని భయంలోకి నెట్టివేస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో క్రిస్‌మస్ వేడుకల స్థానంలో దాదాపు 6 కోట్ల అమెరికన్ ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఇప్పటికే ఉత్తర అమెరికా, కెనడాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న మంచు దుప్పట్లు కమ్ముకొని జనజీవనం అతలాకుతలం కావడంతో పాటు కనీసం 66 మంది పౌరులు మరణించడం జరిగింది. అడుగుల కొద్దీ పేరుకు పోయిన మంచు గుట్టలతో ప్రజలు బయటకు రాలేని దుస్థితి ఏర్పడింది. మృతుల సంఖ్య అంతకంతకు పెరగడంతో పాటు 6,000 లకు పైగా జాతీయ/అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దు కావడం, దారి మళ్లించడం, ఆలస్యంగా నడవడం, హొటల్స్ మూసివేయడం, దుకాణాల్లో సరుకులు దొరక్క పోవడం, హైవేలు మూసివేయడం, అడుగు లోతుల్లో కార్లు కూరుకుపోవడం, కార్లలోనే వ్యక్తులు శవాలుగా మారడం, విద్యుత్తు సరఫరా ఆగిపోవడంతో అంధకారాలు కమ్ముకోవడం, దుకాణాలు లూటీ కావడం లాంటి వార్తలతో ఆయా ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులు నెలకొన్నాయనే వార్తలు హృదయవిదారకంగా తోస్తున్నాయి. న్యూయార్క్ రాష్ట్రంలోని బఫెలో పట్టణ పౌరులు తీవ్రంగా ప్రభావితం కావడం, 34 మంది మరణించడం, పునరావాస శిబిరాలు కిక్కిరిసి పోవడం, ప్రభుత్వ సహాయం కోసం హాహాకారాలు చేయడం జరుగుతున్నది.

ఇలాంటి మహా హిమ ఉత్పాతం శతాబ్దంలో ఒక్కసారి మాత్రమే వస్తుందని, నేడు వాతావరణ పీడనం కనిష్ట స్థాయికి పడిపోవడంతో 'బాంబ్ సైక్లోన్'గా మారి గజగజ వణికిస్తున్నది. డెన్వర్, లాస్‌వేగాస్, షికాగో, అట్లాంటా, బాల్టిమోర్, రాష్ట్రాల్లో హిమపాతం ప్రమాదకరంగా మారిందని యూయస్ ప్రభుత్వం ప్రకటించే స్థాయి రావడం విచారకరం. భీకర మంచు తుఫానుతో సాధారణ ఉష్ణోగ్రతలు మైనస్ 57 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోవడంతో ప్రజల కష్టాలు రెట్టింపు అయ్యాయి. ప్రభుత్వ యంత్రాంగం మంచు గుట్టల్ని తొలగించే విశ్వ ప్రయత్నాలు చేసినప్పటికీ పరిస్థితులు అదుపులోకి రావడం లేదు. అత్యధికంగా న్యూయార్క్ నగరంలో 55.8 అంగుళాలు, బఫెలో నగరంలో 49.2 అంగుళాల మేరకు మంచు పేరుకు పోవడం అక్కడ నెలకొన్న దుర్భర పరిస్థితులకు అద్దం పడుతున్నది. చలి తీవ్రతకు మరిగే నీరు కూడా క్షణాల్లో గడ్డకట్టి పోతున్నది. 'స్నో టెర్రర్' గుప్పిట్లో కోట్లాది ప్రజలు ఊపిరి పీల్చుకోవడం కష్టం అవుతున్నది. 1983, 2014 లో ఇలాంటి వాతావరణ ప్రతికూలాలు కనిపించినా నేటి మంచు తుపాను విపత్తు తీవ్రత గతంలో ఎన్నడు జరగలేదని అంటున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న వాతావరణ ప్రతికూల మార్పులే ఇలాంటి విపత్తులకు కారణమని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ఆర్కిటిక్ శీతల గాలులు వెచ్చటి గాలులతో కలవడంతో వాతావరణ పీడనం తగ్గడంతో ప్రతికూల మార్పులు చోటు చేసుకుంటాయని దీని వల్ల బాంబ్ సైక్లోన్ ఏర్పడడం, వాతావరణంలో అత్యధిక నీటి తేమ చేరడంతో మంచు తుఫాన్లు వస్తున్నాయి. ఎటు చూసినా శ్వేత హిమ పర్వతాలను తలపించే దుస్థితి ఏర్పడింది. నేడు చూస్తున్న వాతావరణ విపత్తుకు కారణాలుగా శిలాజ ఇంధనాల వినియోగం, కర్బన ఉద్గారాలు, భూతాపం, పర్యావరణ కాలుష్యాలు వంటి అంశాలను పేర్కొంటున్నారు. భయంకర తుఫాను కురవడం, 100 కిమీ వేగంతో హరికేన్లను తలపించే శీతల పెను పవనాలు వీచడం, సబ్-జీరో టెంపరేచర్స్ నమోదు కావడంతో పరిస్థితులు అదుపు తప్పుతున్నట్లు తెలుస్తున్నది. మంచు, శక్తిమంతమైన ఆర్కిటిక్ గాలులతో అమెరికాను ముంచెత్తిన ప్రమాదకర మంచు తుఫాను ఫలితంగా 2 మిలియన్ల ప్రజలు, 20 లక్షల గృహాలు/కార్యాలయాలకు విద్యుత్తు సరఫరా ఆగిపోయింది. వాతావరణ నిపుణులు అంచనా వేసినట్లే 'ఆర్కిటిక్ కోల్డ్ బ్లాస్ట్' కాస్తా 'బాంబ్ సైక్లోన్'గా మారడంతో పెనంలోంచి పొయ్యిలో పడినట్లు అయ్యింది. అమెరికా, కెనడా దేశాల చరిత్రలో కనీవినీ ఎరగని వాతావరణ విపత్తుగా అభివర్ణిస్తున్నారు. అతిశీతల వాతావరణంలో మంచు బారిన పడితే శరీర అవయవాలను శిథిలం చేసే ప్రాణాంతక 'ఫ్రాస్ట్ బైట్' వలలో పడే ప్రమాదాలు నెలకొని ఉన్నాయి.

వారం రోజుల్లో తుఫాను ప్రభావం తగ్గవచ్చనే వార్తలు కొంత ఊరటను ఇస్తున్నప్పటికీ నేడు అష్టకష్టాల్లో ఉన్న అమెరికన్లకు సత్వరమే ఆపన్నహస్తాలు అందుతూ, ప్రాణాపాయాలు తగ్గాలని కోరుకుందాం. ఇప్పటికైనా ప్రపంచ దేశాలు వాతావరణ సానుకూల మార్పుల దిశగా వడివడిగా అడుగులు వేయాలని, ఈ బృహత్తర కార్యక్రమానికి అగ్రదేశాలు తొలి అడుగులు వేయాలని కోరుకుందాం. మనిషి ఉంటేనే అభివృద్ధి అని, ఆరోగ్యంగా ఉంటేనే జీవితమని, భూమాత శాంతిస్తేనే మానవ ఉనికి అని చేతులు పూర్తిగా కాలకముందే ఆకులు సిద్ధం చేసుకుంటూ, పర్యావరణ పరిరక్షణకు గొడుగులు పడదాం.

డా॥ బుర్ర మధుసూదన్‌రెడ్డి

ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ చిచ్చు

ఆశిశ్ బిశ్వాస్



ఎన్నికలకు ముందు ఘర్షణలు సృష్టించడం బీజేపీకి అలవాటుగా మారింది. వివిధజాతులు, మతాలు, కులాలమధ్య ఉద్రిక్తతలు సృష్టించి ఎన్నికల్లో ప్రయోజనం పొందడమే ఆ పార్టీ లక్ష్యం. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న త్రిపుర, మేఘాలయ రాష్ట్రాల్లో జాతుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ప్రస్తుతం అక్కడ వాతావరణం ఉద్రిక్తంగా తయారైంది. ఇందుకు ప్రధాన కారణం బీజేపీ అనేది స్పష్టం. చర్చి నిర్వాహకులు, అధికారులు ఎక్కడైనా మతమార్పిడులు చేస్తున్నారా, ఆస్తులు ఆక్రమిస్తున్నారా తెలుసుకుని వివరంగా తమకు నివేదిక పంపాలని 'రహస్య' అసోం పోలీసులు స్పెషల్ బ్రాంచి జిల్లా ఎస్‌పీలను ఆదేశించింది. ఇందుకు సంబంధించి తెలుసుకోవలసిన అంశాలపై ఒక పత్రాన్ని కొందరు ఎస్‌పీలకు జారీ చేశారు. ఉద్రిక్తతలు నెలకొనే అవకాశం ఉందని ముందుగానే ప్రజలలో బలమైన అభిప్రాయం ఏర్పడింది. అనధికారికంగా అత్యంత సున్నితమైన అంశంపై ఇలాంటి పత్రాన్ని పంపించడం ప్రమాదకరమైన విషయం. అయితే అలాంటి చర్య తామేమీ తీసుకోలేదని తనకేమీ బాధ్యతలేదని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వాస్ శర్మ ఒక స్వల్ప ప్రకటన చేశారు. ఎవరూ అడగకుండానే ఈ ప్రకటన చేయడంలోనే అసలు కిటుకుఉంది. పోలీసులను సమాచారం కోసం ఈ విధంగా రాష్ట్రప్రభుత్వం అడిగిందా లేక కేంద్రం అడిగిందా అనేది బైటకు తెలియదు. వాస్తవంగా అధికారులను ఈ సమాచారం ఇబ్బంది పెడుతుంది. ఇది తప్పనిసరిగా ఉద్రిక్తతలకు దారితీసే వ్యవహారమే.

తృణమూల్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి సాకేత్ గోఖలే చర్యతో ఈ వ్యవహారం మరింత ఇబ్బందిగా తయారైంది. భారతదేశంలో ఉన్న వాటికన్ రాయబార కార్యాలయానికి సాకేత్ గోఖలే ఫిర్యాదు చేశారని ఈశాన్య ప్రధాన మీడియా తెలియజేసింది. బీజేపీ పాలనలో క్రైస్తవులను దూరంగా ఉంచేందుకు ప్రయత్నిస్తారని సాకేత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మైనారిటీ క్రైస్తవమతాన్ని భారతదేశంలో లక్ష్యంగా పాలకులు పెట్టుకున్నారని, తగిన అధికారంగల అంతర్జాతీయ వర్గాలు జోక్యం చేసుకోవాలని సాకేత్ కోరారు. అసోం ముఖ్యమంత్రి చేసిన స్వల్ప ప్రకటనతో తాము విభేదిస్తున్నామని తృణమూల్ కాంగ్రెస్ వర్గాలు తెలియజేశాయి. ప్రస్తుతం కేంద్రంలోని హోంమంత్రిత్వ శాఖ ఈ వ్యవహారాలను నిర్వహించవచ్చునని భావిస్తున్నారు. అత్యంత సున్నితమైన సమాచారానికి సంబంధించిన ఆదేశాలను పోలీసు అధికారులకు ఎవరు పంపించారు అన్న అంశం పాలక బీజేపీగానీ, అసోం లేదా ఢిల్లీలో బీజేపీ వర్గాలుగాని ఎలాంటి వివరణ ఇవ్వడంలేదు. ఈ ప్రాంతంలో వివిధ జాతుల ప్రజలు నివసిస్తున్నారు. సాధారణంగా ఈ ప్రాంతంలో జాతుల మధ్య ఉద్రిక్తతలు ఏర్పడుతూనే ఉంటాయి. ప్రస్తుతం ప్రత్యేకించి ఇలాంటి సమాచారంకోసం పోలీసులను కోరడంలోనే సందేహాలు నెలకొన్నాయి. ఎన్నికలకు ముందే మీడియాకు ఈ సమాచారం తెలిసినా ఎవరూ స్పందించక పోవడంతో ప్రజలలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడుతుంది. వివిధజాతుల, ప్రజలమధ్య ఒకరిపట్ల ఒకరికి అపనమ్మకాన్ని సృష్టించి ఎన్నికల్లో ప్రయోజనం పొందడమే దీని వెనుకున్న ఉద్దేశమని భావించవచ్చు. ఘర్షణలవల్ల సామాజిక సఖ్యత శాశ్వతంగా దెబ్బతింటుంది.

త్రిపురలో ప్రస్తుతం ఎన్నికల రణరంగంలో దిగిన తిప్ర మోథ(టీఎం) ప్రవేశించి ప్రకంపనలు సృష్టిస్తున్నప్పటికీ దానితో ఎన్నికల ముందుగా పొత్తుపెట్టుకునేందుకు బీజేపీ నిరాకరించింది. మేఘాలయలో 2018లో 60 అసెంబ్లీ సీట్లకు జరిగిన ఎన్నికల్లో రెండు స్థానాల్లో గెలుచుకున్న బీజేపీ ఇతర పార్టీల నుంచి ఎంఎల్‌ఏలను తమ పార్టీలో చేర్చుకుని ఆరుకు పెరిగింది. మేఘాలయ డెమొక్రటిక్ అలయన్స్ ప్రభుత్వంలో జూనియర్ భాగస్వామిగా చేరింది. ఈసారి ఎన్నికల్లో బీజేపీ స్వతంత్రంగా 25సీట్లకు పోటీచేయాలని భావిస్తోంది. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎర్నెస్ట్ మావ్రైరీ కార్యకలాపాల నిర్వహణతో కొంతమంది నాయకులు సంతృప్తి చెందడంలేదు. ఈ సారి ఎన్నికల్లో ఆయనకూడా పోటీ చేస్తున్నారు. పార్టీ నాయకుల మధ్య ఏర్పడిన తగాదాలను పరిష్కరిస్తామని చెబుతున్నప్పటికీ ఆచరణలో కనిపించడంలేదు. స్వదేశీ గిరిజన సంస్థ నాయకత్వంలో ప్రజాదరణపొందిన ప్రద్యోత్ మాణిక్య టీఎం పార్టీ బలమైన శక్తిగా ఎదిగి ఇతర పార్టీలను సవాలు చేస్తున్నది. రాష్ట్రంలో స్వయంప్రతిపత్తిగల గిరిజన జిల్లా మండళ్ల ఎన్నికల్లో టీఎం పార్టీ మంచి విజయాలను సాధించింది. చదువుకున్న గిరిజన యువకులు టీఎం పట్ల బాగా ఆకర్షితులయ్యారు. మరింత ఉన్నత విద్యను, ఆర్థిక అవకాశాలను దేశీయ గిరిజన ప్రజలకు లభించాలన్న ఆశయంతో యువకులు ఎన్నికల పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం ఏడు దశాబ్దాలకుపైగా గడిచినప్పటికీ గిరిజన ప్రజలు ఇంకా పేదలుగా వెనకబడే ఉన్నారని టీఎం నాయకుడు మాణిక్య తీవ్రంగా విమర్శిస్తున్నారు. తాము అధికారం చేపట్టి తక్షణం ఈ స్థితిని మారుస్తానని వాగ్దానంచేస్తూ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. బీజేపీ కేవలం మాటలు చెప్పడంతోనే సరిపుచ్చుకుందని, చేతలు ఏమీలేవని ఆయన ఆగ్రహం ప్రకటించారు.

టీఎం నాయకుడు మాణిక్య ప్రచారంపైన బీజేపీ ఏమీ స్పందించడంలేదు. తమ జాతి ప్రజలకు ప్రత్యేకరాష్ట్రం ఏర్పాటు చేయాలని టీఎం చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు. బీజేపీ కేంద్రనాయకత్వం దీనిపై ఎలాంటి స్పందన ప్రకటించలేదు. ఈశాన్యంలో చిన్న రాష్ట్రమైన త్రిపురకు వనరులు కూడా స్వల్పమే. ఈ రాష్ట్రాన్ని విడగొట్టి మరో రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం అంత తేలికైన విషయం ఏమీకాదు. ఏమైనా ఉద్రిక్తతలను పరిష్కరించడం కేంద్రం బాధ్యతే.

మనువాదుల ఇటీవలి పరిశోధనలు

డాక్టర్ దేవరాజు మహారాజు

విద్య అసలు లక్ష్యం సమాధానాలు అందించడం కాదు, మరిన్ని ప్రశ్నలు సంధించడం ఎలాగో నేర్పించడం!

– హెలెన్ కెల్లెర్-అమెరికన్ రచయిత్రి,ఉపాధ్యాయురాలు.

ఈ దేశంలో ముప్పయి అయిదు స్మృతులున్నాయి. అందులో లభించినవి ఇరవై ఐదు మాత్రమే. అందులో అతి ముఖ్యమైనది మనుస్మృతి. ఒక రకంగా ఈ దేశంలో పాత రాజ్యాంగం మనుస్మృతే. ఆ మనుధర్మ శాస్త్రంలో నేరస్థులకు వేసే శిక్షలు ఇలాఉన్నాయి. వీటిలో ఉన్న తేడాల్ని శ్రద్ధగా గమనించాలి. శిక్ష ఎవరికైనా కానీయండి, లాభం మాత్రం బ్రాహ్మణ వర్గానికి చేకూరేవిధంగా రాసుకోవడం ఇక్కడ గమనించాల్సిన విషయం.

1. బ్రాహ్మణుడు క్షత్రియుణ్ణి చంపితే వేయి ఆవులు, ఒక ఎద్దు-ఉత్తమ బ్రాహ్మణుడికి ఇవ్వాలి. అదే దోష పరిహారం. అదే శిక్ష (మనుధర్మం 11-127).

2.బ్రాహ్మణుడు వైశ్యుణ్ణి చంపితే దోష పరిహారంగా వంద ఆవులను, ఒక ఎద్దును మరొక బ్రాహ్మణోత్తముడికి దానం ఇవ్వాలి (మనుధర్మం 11-128)

3. ఒకవేళ బ్రాహ్మణుడు శూద్రుణ్ణి చంపితే-పది ఆవులు ఒక ఎద్దును మరో బ్రాహ్మణోత్తముడికి దానం ఇవ్వాలి (మనుధర్మం11-130)

4. ఇక బ్రాహ్మణుణ్ణి చంపడం కంటే మహాపాపం ఈ భూమి మీద మరొకటి లేదు. కాబట్టిరాజు కూడా బ్రాహ్మణుణ్ణి చంపకూడదు. చంపించకూడదు. అసలు ఆ ఆలోచనే మానుకోవాలి(మనుధర్మం 8-381)

ఏకపక్షంగా సాగిన శిక్షలు (దానాలు) పాపం పేరుతో పరిపాలకుల చేతులు కూడా కట్టేశాయి. మనుస్మృతి సహాయంతో సమాజంలో తమ స్థాయి అత్యున్నతంగా నిలుపుకున్న బ్రాహ్మణ వర్గమేమీ ప్రత్యేకంగా అవతరించిన వారు కాదు. జీవపరిణామక్రమంలో ఏర్పడ్డ ఆ మహా మిశ్రమ సంతతివారే. వారి కుట్రలు, కుతంత్రాల సహాయంతో తమనితాము ప్రత్యేకంగా నిలుపు కున్నారు. అంతే! వారి మనుస్మృతి నిజమైతే-మరి రావణుణ్ణి రాముడెలా చంపాడూ? వారు రాసుకున్న రామాయణంలోనే రావణుడు బ్రాహ్మడు. రాముడు క్షత్రియుడు, బ్రాహ్మణుణ్ణి క్షత్రియుడు చంపితే హర్షిస్తున్నారెందుకూ? రాముడికి శిక్షపడాలి కదా? ఆ విషయం ఎందుకు ఆలోచించరూ?

ఎప్పుడో రాయబడ్డ మనుస్మృతిలోని అంశాలు యధాతథంగా సమాజంలోని అన్ని వర్గాలు ఇప్పుడు కూడా ఆచరించాలని మనువాదులు ఆరాటపడుతుంటారు. కాలానుగుణంగా వస్తున్న మార్పుల్ని, నూతనా విష్కరణల్ని వారు పరిగణనలోకి తీసుకోరు. వారి పూర్వీకుల అడుగుజాడల్లో నడుస్తూ కొందరు సమకాలీన అంశాలను కూడా తమ మనుస్మృతిలో రాయబడి ఉన్నట్లు భ్రమిస్తూ ఉంటారు. లేదా మనుస్మృతికి అనుగుణంగా తామే కథలు అల్లుతుంటారు. అలాంటి కొన్ని అసంబద్ధమైన విషయాలు పరిశీలిద్దాం! అలాంటి వాటిని నమ్మకుండా ఉండగలగాలి. తెలివిగా తిప్పికొడుతూ విషయం జనబాహుళ్యానికి తెలియజేస్తూ ఉండాలి. ఇది అందరి సమిష్టి బాధ్యత! ఉదాహరణకు డైనోసార్స్ అంతరించిపోయిన జంతువులు. అవి ఏ దేవుడికీ వాహనం కాలేకపోయాయి. కారణం ఏమిటంటే అవి జీవించి ఉన్నకాలంలో దేవుడిని సృష్టించుకున్న మనిషి లేదు కాబట్టి! కానీ, పంజాబ్ యూనివర్సిటీకి చెందిన ఓ మనువాది ఒక కొత్త విషయం కనిపెట్టాడు. ఆయన ఒక భూ విజ్ఞాన శాస్త్రవేత్త-పేరు అశుఖోస్లా. డైనోసార్లను తొలిసారి కనిపెట్టింది బ్రహ్మ దేవుడే" అని ప్రకటించాడు. దానికి సంబంధిత ప్రస్తావన వేదాల్లో ఉందని బల్లగుద్ది చెప్పాడు. ఎక్కడ ఉంది? ఎలా ఉంది? వివరంగా చెపితే అందరికీ బోధపడేది కదా? బ్రహ్మ ఒక కల్పించుకున్న దేవుడు. డైనోసార్లు ఈ భూమిమీద పుట్టి, కొన్ని ఏళ్లపాటు తమ ఉనికిని చాటుకుని కాలక్రమంలో అంతరించిపోయిన జీవులు. వాటిని బ్రహ్మదేవుడు కనిపెట్టడమేమిటీ? ఇతర దేశస్థులకు డైనోసార్ల గురించి తెలుసుకానీ, హిందూపురాణాల్లోని బ్రహ్మదేవుడి గురించే తెలియదు. ప్రపంచ దేశాల వైజ్ఞానికులంతా అంగీకరిస్తేనే ఏదైనా వైజ్ఞానిక అంశంగా గుర్తిస్తారు. ఆధారాలు లేకుండా చేసే మూర్ఖపు ప్రకటనల్ని శాస్త్ర జగత్తు అంగీకరించదు. డైనోసార్లమీద పరిశోధనలుచేసిన వారి విలువ తగ్గించడానికి అశు ఖోస్లా అనేవాడు ఒక అబద్ధం ప్రకటించాడు. పోనీ, మన దేశంలోని ప్రఖ్యాత వేదపండితులైనా బ్రహ్మదేవుడి పరిశోధనలగూర్చి మాట్లాడలేదేమీ చెప్మా? వేదాలలో ఏమున్నదో వారికి బాగా తెలుసు కాదా?

మనదేశంలో నేటి దేశభక్తుల తెలివి మామూలుగా ఉండడంలేదు. వారుచేసిన, చేస్తున్న ప్రచారాలు ఎలా ఉంటున్నాయో అందరికీ తెలుసు. అందులో ఒకటి ఇలా ఉంది. "గోవుని హత్తుకోవడం వల్ల ఆక్సిటోసిన్-అనే హార్మోన్ విడుదల అవుతుంది. తద్వారా ఒంటరితనం ఉండదు. మానసిక ఆందోళన తగ్గుతుంది అని క్రైస్తవ దేశమైన నెదర్లాండ్‌లో ఆ దేశపు యూనివర్సిటీ ప్రకటించింది. మరి ఈ విషయం ఇక్కడి గొర్రెలకు ఎప్పుడు అర్థమవుతుందో" అనే ఒక పోస్టర్ జై గోమాత శీర్షికతో ప్రచారమైంది. జై గోమాత శీర్షికతో ఇలాంటివి ఎవరు ప్రచారం చేస్తారో వేరే చెప్పనక్కరలేదు కదా? సరే ఇదే విషయం మనం కొంచెం లోతుగా ఆలోచిద్దాం! అప్పుడు గొర్రెలెవరో బాగా తెలుసుకోవచ్చు.

మన మెదడులో హైపోథాలమస్ అనే భాగం ఉంటుంది. ఇది రక్తపోటుకు, గుండె కొట్టుకొనే విధానాన్ని, శరీర ఉష్ణోగ్రత, జీర్ణవ్యవస్థని ప్రభావితం చేస్తుంది. మెదడు కింది భాగంలో ఒక చిక్కుడు గింజంత పరిమాణంలో పిట్యుటరీ గ్రంథి ఉంటుంది. ఇక, ఆక్సిటోసిన్ అనేది ఒక హార్మోన్, హార్మోన్ అంటే రసాయనిక పదార్థం. ఈ ఆక్సిటోసిన్ హైపోథాలమస్‌లో ఉత్పత్తిఅయి, కింద ఉన్న పిట్యుటరీ గ్రంథిలో నిలువ ఉంటుంది. ఆ హార్మోన్ అవసరమైనప్పుడు రక్తప్రవాహంలో కలిసి శరీరంలో ఏ భాగానికి అవసరమైతే ఆ భాగానికి చేరుకుంటుంది. ముఖ్యంగా ఈ హార్మోన్ స్త్రీ, పురుష ప్రత్యుత్పత్తి అవయవాలకు అందుతుంది. స్త్రీలలో కాన్పు జరగడానికి, కాన్పు తర్వాత పాలుపడడానికీ ఈ ఆక్సిటోసన్ హార్మోన్ ఉపయోగపడుతుంది. ఇవీ ఆక్సిటోసిన్‌కు సంబంధించిన వైజ్ఞానిక వివరాలు. రోడ్డు మీద గోవు కనబడగానే ఎవరుపడితే వారు హత్తుకుంటే ఆక్సిటోసిన్ హార్మోన్ విడుదల కాదు. ఆ గోవును చిన్నప్పటి నుంచి పెంచుకున్నవారికి దాని మీద ప్రేమ ఉంటుంది. అలాంటివారు దాన్ని హత్తుకుంటారు. వేరేవాళ్లకు ఆ కోరికే కలగదు. గోవు ఏమైనా గర్ల్‌ఫ్రెండా? జీవిత సహచరా? అదొక జంతువు. కౌగలించుకున్న వాడు మనిషి. హార్మోన్లు ఉత్పత్తి అయ్యే అవకాశమే ఉండదు. నెదర్లాండ్ కాదు గదా ప్రపంచంలో ఏ యూనివర్సిటీ ఈ విషయం ప్రకటించలేదు. అదొక అబద్ధం. తెలివిలేని గొర్రెలే ఇలాంటివి నమ్ముతారు. ఒకటి రెండు సైన్సు పదాలు పట్టుకుని జనాన్ని మభ్యపెట్టడానికి దేశభక్తులు చేసే వ్యర్థ ప్రయత్నం ఇది.

శ్రీరాముడు మోదీ రూపంలో అవతారం ఎత్తాడు. అని దేశభక్తులు భజన చేయడం ప్రారంభించారు. అంతేకాదు, లక్ష్మణుడు, అమిత్‌షా, రూపంలో జన్మించాడట. ఇక హనుమంతుడు-ఆదిత్యనాథ్ రూపం దాల్చాడట. ఈ దేశంలో రామరాజ్యం కలలను వీళ్లంతా నిజం చేయడానికి సంకల్పించారట. ఇకపోతే బెంగాల్ సీఎం మమతాబెనర్జీని శూర్పణఖతో పోల్చాడు ఉత్తరప్రదేశ్ బీజేపీ ఎం.ఎల్.ఏ సురేంద్రసింగ్. బావుంది. పోలికలన్నీ బాగానే ఉన్నాయి కానీ, ఆ ఎంఎల్‌ఏ సురేంద్రసింగ్ ఇంకా ఒక విషయం చెబితే బావుండేది. రాముడు సీతను ఏ అడవిలో వదిలేశాడో కూడా చెప్పాల్సింది. ఏమైనా అతనివల్ల ఒక మేలు జరిగింది! ఇంతవరకూ ఉన్న 'రామరాజ్యం' భ్రమల్ని బద్దలు కొట్టాడు. రామరాజ్యం ఇంత హీనంగా ఉంటుందన్న నిజాన్ని చెప్పి, ప్రజల కళ్లు తెరిపించాడు. ముస్లింల పేర్లు ఉస్మాన్, రహమాన్‌లాగా ఆంజనేయుడి పేరు హనుమాన్ అని ఉంది కాబట్టి, హనుమాన్ ముస్లిం-అని ప్రకటించాడు మరో దేశభక్త నేత. హిందీ మాట్లాడం అని అనేవారు. దేశం వదిలివెళ్లాలని ఒక యూపీ దేశభక్తుడు ఆజ్ఞాపిస్తే, తమిళనాడు విద్యామంత్రి సవినయంగా ఇలా నివేదించుకున్నాడు. "అయ్యా! హిందీ వచ్చినవారు మా కోయంబత్తూర్‌లో పానీపురి అమ్ముకుంటున్నారు. ఏం ఫరవాలేదు. మాకు తమిళం, ఇంగ్లీషు, భాషలు చాలు" అని ప్రకటించాడు మంత్రి కె.పొన్ముడి "ఎక్కువ మాట్లాడితే మాకు స్వతంత్ర ప్రతిపత్తి కావాలని డిమాండ్ చేస్తాం" అని కూడా స్టాలిన్ ప్రభుత్వం ఒక హెచ్చరిక చేసింది.

"మనిషి తన ఆలోచనలతో జ్ఞానాన్ని సంపాదించుకుంటాడు. జన్మత: కాదు" అన్నది నిజం. కాని వైదికమతం ఒప్పుకోదు. దాని ప్రకారం కొందరు జన్మతోనే యోగ్యులవుతారు. మరికొందరు అయోగ్యులవుతారు. ఈ 21వ వైజ్ఞానిక శతాబ్దంలో ఇలాంటి ఆలోచనలు నిలుస్తాయా? ఎప్పటికప్పుడు ఎవరికివారు వారి వయసు, అనుభవంతో సంబంధంలేకుండా నిరంతరం తెరచిన మెదళ్లతో జ్ఞానాన్ని సంపాదించుకుంటూ ఉండాలి. మన పూర్వీకులకు తెలియని ఎన్నో విషయాలు మన తరానికి తెలుస్తున్నాయి. ఇంకా ముందుతరాలు మరిన్ని కొత్త విషయాలు తెలుసుకుంటూ ఉంటారు. తెలుసుకుని ఏం చేయాలి? అంటే మూఢత్వంలో కూరుకుపోకుండా చేతనత్వంతో సజీవంగా జీవించాలి!

పదార్థానికి సంబంధించిన పరమాణువులు, వాటి అమరికవల్ల ఏర్పడ్డ అణువులు, వాటినుంచి జీవ రసాయనాలు, ఆర్ఎన్ఏ, డిఎన్ఏలు, లిపిడ్స్, ఏకకణజీవులు, బహుకణ జీవులు సుమారు నాలుగువందల కోట్లు అని అనుకుందాం. వీటన్నిటి పరిణామక్రమంలో జరిగిన, జరుగుతున్న ఎన్నో మార్పులు జీవుల మధ్య జరిగిన జీవన్మరణ పోరాటాలు, సహాయ సహకారాలు.. ఎన్ని ఎన్నని చెప్పుకోగలం? ప్రకృతిని చూసి పరవశించడమే కాదు, దాన్ని లోతుగా అర్థం చేసుకోవడం కూడా అవసరం. ఉట్టి ఈస్తటిక్ సెన్స్ ఉంటే సరిపోదు, దానితోపాటు సైంటిఫిక్ అవుట్‌లుక్ కూడా నేడు చాలా అవసరం. మనకు తెలిసిన కొన్ని, తెలియకుండా కొన్ని ప్రకృతిలో ఎన్నెన్నో జరిగిపోతున్నాయన్న వాస్తవం గ్రహించుకోవాలి కదా? ఈ విషయాలన్నీ ఆలోచించగలిగిన వారికి ప్రపంచాన్ని చూసే దృష్టి కోణం వేరుగా ఉంటుంది. ఈ అవగాహనలేనివారి ఆలోచన పరిమితమైన పరిధిలో కుచించుకుపోయి ఉంటుంది. ఒక పరిమితిలో కుంచించుకుపోయిన వారు వారి ఆలోచనా విధానాన్ని, అవగాహనా స్థాయిని పెంచుకోకుండా విశాల దృక్పథం గలవారి మీద అజమాయిషీ చేయాలని చూస్తున్నారు. ప్రపంచంలో జరుగుతున్న అనర్థాలకు, దోపిడీలకు, దాడులకు, యుద్ధాలకు ఇదే కారణం. అందువల్ల, ఒకవైపు సృష్టి రహస్యాలు, విశ్వ పరిజ్ఞానం, జీవ పరిణామ పరిజ్ఞానం సామాజిక జీవనంలో సాధించుకుంటున్న ప్రగతినిగూర్చి సమకాలీనంలో అందరూ తెలుసుకుంటూ ఉండాలి. తెలుసుకున్నది వచ్చే తరాలకు అందించగలగాలి. అవగాహనలేని తిరోగమనమార్గం మానవ వినాశనానికి మాత్రమే దారి తీస్తుంది!

కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవ శాస్త్రవేత్త

గయ డిప్యూటీ మేయర్‌గా కష్టజీవి

చరిత్ర సృష్టించిన చింతాదేవి

పాట్నా: బీహార్‌లోని గయ మున్సిపాలిటీ డిప్యూటీ మేయర్‌గా పారిశుధ్య కార్మికురాలు చింతాదేవి ఎన్నికయ్యారు. గత 40 ఏళ్లుగా సఫాయి కార్మికురాలిగా పనిచేసిన ఆమె ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్పొరేటర్‌గా గెలిచి చరిత్ర సృష్టించారు. తరువాత జరిగిన ఎన్నికల్లో డిప్యూటీ మేయర్‌గా చింతాదేవిని సభ్యులు చింతాదేవిని ఎన్నుకున్నారు. మాజీ డిప్యూటీ మేయర్ మోహన్ శ్రీవాత్సవ కూడా ఆమెకు మద్దతు తెలిపారు. చింతాదేవి పారిశుధ్య పనులేకాక కూరగాయలు కూడా అమ్మి జీవనం సాగించారు. మరుగు దొడ్లు తక్కువగా ఉన్న కాలంలో మానవ మలాన్ని తట్టల్లో తలపై మోసుకెళ్లారు. అలాంటి అట్టడుగు వర్గానికి చెందిన మహిళ డిప్యూటీ మేయర్‌గా ఎన్నిక కావడం చారిత్రాత్మకం అని గయ మేయర్‌గా ఎన్నికైన గణేష్ పాశ్వాన్ ప్రశంసించారు. గయలో అట్టడుగు వర్గాలకు చెందిన వారు ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక కావడం ఇదే తొలిసారి కాదు. రాళ్లు కొట్టే ముసహర్ కమ్యూనిటీకి చెందిన భగవతీ దేవి 1996లో నితీశ్ కుమార్ నేతృత్వంలోని జనతాదళ్ (యునైటెడ్) పార్టీ తరుఫున గయ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు.

భారత్‌లో కొత్త తరహా కోవిడ్

గుజరాత్‌లో తొలి కేసు నమోదు

అహ్మదాబాద్: ప్రమాదకరమైన కొవిడ్ ఎక్స్‌బీబీ 1.5 వేరియంట్ భారత్‌లోకి ప్రవేశించింది. ఈ వేరియంట్ తొలి కేసు గుజరాత్‌లో నమోదైంది. ఇది గత వేరియంట్ బీక్యూ.1 తో పోలిస్తే 120 రెట్లు ఎక్కువ అంటువ్యాధి అని అమెరికాకు చెందిన పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఇటీవలే అమెరికాలో కనుగొన్న ఈ వేరియంట్‌ను సూపర్ వేరియంట్‌గా నిపుణులు చెపుతున్నారు. ఈ వేరియంట్ కారణంగా ఆసుపత్రుల్లో చేరే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఇది అన్ని రకాల వేరియంట్ల కన్నా వేగంగా మన రోగనిరోధక వ్యవస్థను దెబ్బతీసే ప్రత్యేకతను కలిగి ఉన్నదని చైనీస్ మూలాలున్న అమెరికన్ ఆరోగ్య నిపుణుడు ఎరిక్ ఫీగెల్ డింగ్ తెలిపారు. మన దేశానికి సంబంధించి ఈ వేరియంట్ తొలి కేసు గుజరాత్‌లో నమోదైంది. దీనితో వైద్యులు అప్రమత్తమయ్యారు.

వేతనాల కోసం అలీగఢ్ వర్సిటీ ఉద్యోగుల ఆందోళన

అలీగఢ్: వేతనాల కోసం అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. చాలాకాలంగా వేతనాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ 1600 మంది బోధనేతర ఉద్యోగులు సమ్మె చేశారు. ఆందోళన శాంతియుతంగా జరుగుతోంది. ఆందోళనకారుల్లో అత్యధికులు కాంట్రాక్టు కార్మికులు. రోజువారీ వేతనంపై వారు విధులు నిర్వహిస్తున్నారు. తమ బాధలు చెప్పడానికి కార్మికులంతా వైస్‌చాన్సలర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ముందు జాగ్రత్త చర్యగా క్యాంపస్‌లోని అన్ని ప్రవేశ మార్గాల్లో అధికారులు భద్రతా చర్యలు చేపట్టారు. నవంబరు వేతనం ఇంకా తమకు ఇవ్వలేదని యూనివర్సిటీ టెక్నికల్ స్టాఫ్ కార్యదర్శి రిహాన్ అహ్మద్ విలేకరులకు చెప్పారు. దశాబ్దాలుగా తామంతా కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నామని చెప్పారు.

చాపకింద నీరులా బీజేపీపై వ్యతిరేకత

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా బీజేపీ పట్ల వ్యతిరేకత చాపకింద నీరులా ఉందని, ప్రత్యామ్నాయ దృక్పథాన్ని ప్రజలకు అందించడానికి ప్రతిపక్షాలు ఏకం కావాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శనివారం అన్నారు. ఇక్కడ ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారత్ జోడో యాత్ర ప్రజలకు కొత్త పని విధానాన్ని, ఆలోచనను అందించడానికి ఒక కార్యాచరణను అందించిందని అన్నారు. దేశ రాజకీయ రంగాన్ని పూర్తిగా శాసిస్తున్న బీజేపీని ఎదుర్కోవడంలో ప్రతిపక్ష నాయకులు, కాంగ్రెస్ మధ్య పరస్పర గౌరవాన్ని కూడా గాంధీ కోరుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల గురించి మాట్లాడుతూ 'ప్రతిపక్షాలు ఒక విజన్‌తో సమర్థవంతంగా నిలబడితే, బీజేపీకి ఎన్నికల్లో గెలవడం చాలా కష్టం. అయితే ప్రతిపక్షాలు సమర్థవంతంగా సమన్వయం చేసుకోవాలి. ప్రతిపక్షం ప్రత్యామ్నాయ దృష్టితో ప్రజల వద్దకు వెళ్లాలి' అని అన్నారు. కాంగ్రెస్ భావజాలంతో సారూప్యత ఉన్న పార్టీలు అన్నీ కలిసి రావాలని వివరించారు. ఈ సందర్భంగా అఖిలేశ్ యాదవ్, మాయావతిల పేర్లను ఉటంకించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై మరోసారి విమర్శలు చేశారు. ఎలా ఉండకూడదో వారి నుంచే నేర్చుకుంటున్నానంటూ కాషాయ పార్టీపై వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అదే విధంగా బీజేపీని తాను గురువుగా భావిస్తున్నారని తెలిపారు. వారు తమపై ఎంత దాడి చేస్తే తాము అంత బలోపేతం అవుతామని తెలిపారు. వారు ఏం చేస్తున్నారు? ఏం చెబుతున్నారు? ఇవన్నీ జాగ్రత్తగా గమనించి వాటిని ఆచరించకుంటే చాలు అని అన్నారు. తాను కన్యాకుమారి నుంచి పాదయాత్ర మొదలు పెట్టినప్పుడు పెద్దగా లక్ష్యాలు ఏమీ పెట్టుకోలేదని, కానీ, పాదయాత్రలో తాను ఎన్నో విషయాలు నేర్చుకున్నానని వివరించారు. అందరూ వచ్చి తన తో పాదయాత్రలో చేరారని అన్నారు. భారత్ జోడో యాత్రలో చేరడానికి ద్వారాలు తెరిచే ఉంటాయని చెప్పారు. భారతదేశం 'అద్దె కోరే' దేశంగా కాకుండా 'ఉత్పత్తి దేశం'గా ఉద్భవించాలని రాహుల్ తన దృష్టిని వివరిస్తూ చెప్పారు. పిల్లల ఊహలకు రెక్కలు కట్టేలా... వైద్య, ఇంజినీరింగ్, సివిల్ సర్వీసెస్, న్యాయం వంటి కెరీర్‌లకు అతీతంగా విద్యా విధానం ఉండాలని తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న 'గందరగోళ' విధానం వలె కాకుండా స్పష్టమైన విదేశాంగ విధానం, గొప్ప ఆర్థిక సమానత్వం గురించి కూడా ఆయన మాట్లాడారు. ఆర్థిక వ్యవస్థలో పెద్ద వ్యాపారాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నందున తాను వాటికి అనుకూలంగా ఉన్నానని, అయితే దానిని 'ఇద్దరు-ముగ్గురు వ్యక్తులు' నియంత్రించకూడదని రాహుల్ అన్నారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కచ్చితంగా గెలిచి తీరుతుందని అన్నారు. కావాలంటే పేపర్ పై రాసిస్తా అని తెలిపారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ కనిపించకుండా పోతుందని వివరించారు. ఎక్కడా కనిపించదని అన్నారు. ఇది తన హామీ అని స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ అవినీతి ప్రజలందరి కళ్ల ముందే జరిగిందని, డబ్బులు గుమ్మరించి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారనే ప్రజలందరి ఆలోచనల్లో ఉన్నదని రాహుల్ గాంధీ అన్నారు. కాబట్టి, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తీరుతుందని వివరించారు. కాంగ్రెస్ ఊడ్చేస్తుందని చెప్పారు.

వణుకుతున్న ఉత్తరాది

న్యూఢిల్లీ: ఉత్తరాది రాష్ట్రాలు చలితో వణికిపోతున్నాయి. హిమాలయాల నుంచి వస్తున్న శీతల గాలుల వల్ల అనేక రాష్ట్రాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయినట్లు భారత వాతావరణ శాఖ పేర్కొన్నది. ఈశాన్య ఉత్తరాదిలో ఉష్ణోగ్రతలు మూడు నుంచి ఐదు డిగ్రీలకు పడిపోయాయి. రానున్న ఐదు రోజుల పాటు ఢిల్లీలో దట్టమైన పొగ మంచు కప్పుకోనున్నది. జనవరి ఒకటో తేదీ నుంచి ఈశాన్య రాష్ట్రాల్లో చలిగాలుల తీవ్రత ఉంటుందని ఐఎండీ ఒక ప్రకటనలో తెలిపింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలీ, చనబా, కుఫ్రి, నార్కండ లాంటి ప్రాంతాల్లో మళ్లీ మంచు కురుస్తోంది. మరికొన్ని రోజుల పాటు మంచు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

సీబీఎస్ఈ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 10, 12వ తరగతుల పరీక్షలు ఫిబ్రవరి 15 నుంచి జరుగనున్నట్టు బోర్డు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే పరీక్షల టైం టేబుల్‌లో స్వల్ప మార్పు చోటు చేసుకుంది. 12వ తరగతికి సంబంధించి ఏప్రిల్ 4న జరగాల్సిన పరీక్షను మార్చి 27నే నిర్వహించనున్నట్లు సీబీఎస్ఈ ప్రకటించింది. మిగతా పరీక్షల తేదీల్లో ఎలాంటి మార్పులు చోటు చేసుకోలేదు. పదో తరగతి పరీక్షలు 29వ తేదీన ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే జరగనున్నాయి.

త్రిపురలో బీజేపీకి మరో ఎమ్మెల్యే రాజీనామా

అగర్తలా: త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆ రాష్ట్రంలో బీజేపీకి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన కరంచెర్ర ఎమ్మెల్యే దిబచంద్ర హ్రాంగ్‌ఖావల్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. త్రిపురలో అధికార కూటమి నుంచి ఈ ఏడాది రాజీనామా చేసిన ఏడో ఎమ్మెల్యే ఆయన. ఈ ఏడాది మొత్తం నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజల తీర్పు ఏ విధంగా ఉంటుందో ముందే పసిగట్టి వీరు బీజేపీకి దూరమవుతున్నట్లు కనిపిస్తున్నది. దిబచంద్ర అనారోగ్య కారణాల వల్ల రాజీనామా చేసినట్లు బీజేపీ చెపుతున్నా, తాను రాజకీయాల్లోనే ఉంటానని, తదుపరి కార్యాచరణ త్వరలో ప్రకటిస్తానని దిబచంద్ర ప్రకటించారు. గతంలో దిబచంద్ర రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా కూడా పని చేసి 2018 ఎన్నికల ముందు బీజేపీలో చేరారు. ఆయన త్వరలో కాంగ్రెస్ గూటికి తిరిగి చేరే అవకాశాలు ఉన్నాయి. రాజీనామా తర్వాత అనేక మంది కాంగ్రెస్ నేతలు ఆయనను కలిశారు. దిబచంద్రకు సన్నిహితుడైన సుదీప్ రాయ్ కూడా ఇటీవల బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు.

గుజరాత్‌లో రోడ్డు ప్రమాదం : 9 మంది మృతి

నవసారి : గుజరాత్‌కు చెందిన నవసారి జిల్లాలో శనివారం తెల్లవారుజామున ఒక జాతీయ రహదారిపై స్పోర్ట్స్ వినియోగ వాహనం (ఎస్‌యూవీ) రోడ్డు డివైడర్‌ను దూకిన తర్వాత ఒక లగ్జరీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 9 మంది మరణించగా, మరో 29 మంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు. దాదాపు 3.20 గంటల సమయంలో వెస్మా గ్రామ సమీపంలో వల్సాద్ వెళుతున్న బస్సును అపసవ్య దిశలో వచ్చిన ఎస్‌యూవీ ఢీకొందని నవసారి పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) రుషికేశ్ ఉపాధ్యాయ్ చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ ప్రమాదం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు. ఎస్‌వీయూ డ్రైవర్ వాహనంపై అదుపు కోల్పోవడంతో అది డివైడర్‌ను దూకి, ముంబై-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై లగ్జరీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎస్‌యూవీ పూర్తిగా ధ్వంసమైంది' అని ఉపాధ్యాయ్ వివరించారు. కాగా ఎస్‌వీయూలో ప్రయాణిస్తున్న 9 మందిలో ఎనిమిది మంది అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయని, ప్రమాదంలో బస్సు ప్రయాణికుల్లో ఒకరు మరణించారని తెలిపారు. ఎస్‌వీయూ భరూచ్ జిల్లాలోని అంకళేశ్వర్ వెళుతుందని అన్నారు. ప్రమాదంలో గాయపడిన 29 మంది నవసారి, అలాగే పొరుగున ఉన్న వల్సాద్ నగరంలోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. 'బస్సులోని చాలా మంది ప్రయాణికులు వల్సాద్ జిల్లా నుంచి వస్తున్నారు. అయితే ఎస్‌వీయూలో ఉన్నవారు రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాలైన భరూచ్, జునాగఢ్, రాజ్‌కోట్, సూరత్‌కు చెందినవారు. వారందరూ భరూచ్ జిల్లాలోని అంకళేశ్వర్‌లో పని చేస్తున్నారు' అని నవసారి పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ప్రమాదంలో మరణించిన 9 మందికిగాను ఐదుగురు 20 ఏళ్ల వయస్సు వారని అన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ప్రమాదం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్థానిక యంత్రాంగం గాయపడిన వారికి చికిత్స అందించాలని ట్వీట్ చేశారు.

మార్చి 2న మిజోరంలో జీ 20 సదస్సు

ఐజ్వాల్: వచ్చే ఏడాది మార్చిలో జరిగే జీ 20 సదస్సుకు మిజోరం ఆతిథ్యం ఇవ్వనున్నదని, సదస్సును విజయవంతం చేయడానికిగాను రాష్ట్ర ప్రభుత్వం కోర్ కమిటీని ఏర్పాటు చేసిందని సీనియర్ అధికారి ఒకరు శనివారం చెప్పారు. హోంశాఖ కమిషనర్ హెచ్.లలెంగ్‌మవియా అధ్యక్షతన ఏర్పడే కమిటీ సదస్సు ఏర్పాట్లను పర్యవేక్షిస్తుందని, మార్చి 2న సదస్సు నిర్వహిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రేణు శర్మ తెలిపారు. రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా సదస్సు నిర్వహించడానికి అనేక ఉపకమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

172 మంది ఉగ్రవాదుల హతం

శ్రీనగర్: కశ్మీర్‌లో 2022 సంవత్సరం మొత్తం 172 మంది ఉగ్రవాదులు భద్రతా దళాల చేతిలో హతమయ్యారు. అందులో 42 మంది ఉగ్రవాదులు ఉన్నారు. 2022లో జరిగిన ఉగ్రవాద ఏరివేత కార్యక్రమాలు, ఎదురుకాల్పులు, ఇతర వివరాలను సీనియర్ పోలీసు అధికారి ఒకరు శనివారం వెల్లడించారు. భద్రతా దళాలు 90కి పైగా ఆపరేషన్లు చేపట్టినట్లు వివరించారు. ఉగ్రవాద సంస్థల్లో యువత నియామకాలు 37శాతం తగ్గినట్లు ఆయన తెలిపారు. 2022లో కశ్మీరులో 93 విజయవంతమైన ఎన్‌కౌంటర్లు జరిగాయని కశ్మీర్ ఏడీజీపీ విజయ్‌కుమార్ ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. లష్కరే తోయిబా లేదా దాని అనుబంధ సంస్థలకు చెందిన 108 మంది ఎన్‌కౌంటర్లలో హతమయ్యారని, జైషే మహ్మద్ నుంచి 35 మంది, హిజ్‌బుల్ ముజాహిదీన్ నుంచి 22మంది, అల్ బదర్ నుంచి నలుగురు, అన్సార్ ఘజ్వాత్ ఉల్ హింద్ నుంచి ముగ్గురు ఉగ్రవాదులు చనిపోయినట్లు విజయ్‌కుమార్ తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో 14మంది జమ్ముకశ్మీరు పోలీసు సిబ్బంది సహా 26మంది భద్రతా సిబ్బంది మృతిచెందారని పేర్కొన్నారు. ఉగ్రనేరాలకు పాల్పడుతున్న మెజారిటీ టెర్రరిస్టులను తటస్థం చేశామని కుమార్ వెల్లడించారు. 29మంది పౌరులను ఉగ్రవాదులు చంపేశారని, అందులో ముగ్గురు కశ్మీరీ పండితులు సహా ఆరుగురు హిందువులు, 15 మంది స్థానిక ముస్లింలు, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 8మంది ఉన్నారని వివరించారు. బసిత్ దర్, అదిల్ వనీ మినహా చాలామంది ఉగ్రవాదులను తటస్థులుగా మార్చగలిగామని, ఆ ఇద్దరు కూడా త్వరలో మారతారని విజయ్‌కుమార్ తెలిపారు.

జనరిక్ మందుల షాపుల పెంపు

కేంద్ర ప్రభుత్వం యోచన

న్యూఢిల్లీ: దేశంలో జనరిక్ మందుల దుకాణాల సంఖ్య పెంచాలని యోచిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం శనివారం తెలిపింది. 2024 మార్చి నాటికి దేశంలో 10 వేల ప్రధానమంత్రి భారతీయ జనౌషధి కేంద్రాలు (పీఎంబీజేకే) పెంచనున్నట్లు వెల్లడించింది. ప్రజలందరికీ తక్కువ ధరకు నాణ్యమైన మందులు అందించడంలో భాగంగా ఆ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన(పీఎంబీజేపీ) ద్వారా గడచిన 8 ఏళ్లలో రూ.18 వేల కోట్లు ఆదా చేసినట్లు అధికారిక ప్రకటన తెలిపింది. దేశవ్యాప్తంగా 766 జిల్లాలకుగాను 743 జిల్లాల్లో 9 వేలకు పైగా దుకాణాలు ఏర్పాటు చేయడం ద్వారా ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రజల వద్దకు తీసుకెళ్లిందని వివరించింది. పీఎంబీజేకేలలో బ్రాండెడ్ మందుల ధర కన్నా 50 నుంచి 90 శాతం తక్కువ. కార్డియోవాస్కులర్, యాంటీ క్యాన్సర్స్, యాంటీ డయాబెటిక్స్, యాంటీ ఇన్‌ఫెక్టివ్స్, యాంటీ అలర్జిక్, గ్యాస్ట్రో-ఇంటెస్టినల్ మెడిసిన్, న్యూట్రాస్యూటికల్స్ సహా 1759 రకాల మందులు, 280 సర్జికల్ డివైసెస్ అందుబాటు ఉన్నాయి. రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ కింద గల ఫార్మాస్యూటికల్స్ విభాగం ద్వారా పీఎంబీజేపీలను 2008 నవంబరులో ప్రారంభించింది. 2017 నాటికి 3 వేల కేంద్రాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది. తర్వాత 2020 నాటికి 6 వేల కేంద్రాలు తెరవాలని లక్ష్యంగా పెట్టుకొని...దానిని సాధించింది. ఈ ప్రయాణంలో గత ఆర్థిక సంవత్సరం నాటికి 8,610 నుంచి 9 వేల కేంద్రాలకు సంఖ్య పెరిగింది. అంతిమంగా 743 జిల్లాల్లో 9 వేలకు పైగా పీఎంబీజేపీ కేంద్రాలు ప్రారంభమయ్యాయని ఆ ప్రకటన వివరించింది. ఇక 2024 మార్చి నాటికి ఈ సంఖ్యను 10 వేలకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. 2021-22లో జనౌషధి షాపుల ద్వారా రూ.893.56 కోట్ల మందులు విక్రయించారు. బ్రాండెడ్ మందులతో పోలిస్తే ప్రజలకు రూ.5,300 కోట్ల డబ్బు ఆదా అయింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 2022 నవంబరు 30 నాటికి రూ.758.69 కోట్ల మందులు విక్రయించారు. దీనిద్వారా ప్రజలకు రూ.4,500 కోట్ల లబ్ధి చేకూరిందని ఆ ప్రకటన తెలిపింది. ఈ పథకం స్వయం ఉపాధికి బాగా ఉపయోగపడుతోందని రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ పేర్కొంది. పీఎంబీజేపీ కింద ఆర్థికసాయంగా జనౌషధి కేంద్రాలకు రూ.5 లక్షల ప్రోత్సాహం అందించారు.

ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలో అమానుషం

న్యూఢిల్లీ: దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో అమానుషం చోటుచేసుకుంది. రెండవ తరగతి చదువుతున్న 8 ఏళ్ల బాలుడి ప్రైవేట్ అవయవానికి సహచర విద్యార్థులు నైలాన్ తాడు బిగించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటన దక్షిణ ఢిల్లీ కిద్వాయ్ నగర్‌లోని ఎన్‌డీఎంసీ పాఠశాలలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలను పోలీసులు శనివారం వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ అధికారి ఒకరు చెప్పారు. బాలుడికి తల్లి స్నానం చేపిస్తుండగా ఈ దుర్మార్గం బుధవారం బయటపడినట్లు పోలీసులు తెలిపారు. వెంటనే బాలుడిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలోని సహచర విద్యార్థులు ఈ దారుణానికి పాల్పడినట్లు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ బాలుడి ఆరోగ్యం నిలకడగానే ఉందని, అయితే ఇంకా పరిశీలనలోనే ఉంచామని వైద్యులు తెలిపారు. ఈ ఘాతుకానికి పాల్పడిన పిల్లలను ఆ బాలుడు గుర్తించకపోవడంతో ఇంకా కేసు నమోదు చేయలేదని డీసీపీ(దక్షిణం) చందన్ చౌదరి చెప్పారు. దీనిపై న్యాయనిపుణుల అభిప్రాయం తీసుకుంటున్నామన్నారు. ఈ దారుణానికి కారణమైన విద్యార్థులను గుర్తించడానికి ఆ బాలుడిని తమతో పాటు పాఠశాలకు తీసుకెళ్లామన్నారు. విద్యార్థులు శీతాకాల సెలవుల్లో ఉన్నారని ఆ అధికారి తెలిపారు. నిందితులు కూడా పిల్లలే అయినందున జువెనైల్ జస్టిస్ బోర్డు ముందు ప్రవేశపెడతామని వివరించారు.

మంచి వర్షాలు పడాలి: పవార్

బారామతి: వచ్చే ఏడాది మంచి వర్షాలు కురిస్తే దేశానికి అది గొప్ప సంవత్సరం అవుతుందని ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ శనివారం చెప్పారు. మంచి వర్షాలు కురిస్తే వ్యవసాయానికి మంచి జరుగుతుందని, దేశ ఆర్థిక వ్యవస్థ మరింత పుంజుకుంటుందని అభిప్రాయపడ్డారు. ఎగుమతులకు సంబంధించి భారత్ అత్యంత కీలక దేశంగా ఆవిర్భవిస్తుందని ఆయన చెప్పారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని...పుణెలోని తన సొంత పట్టణంలో శరద్ పవార్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'దేశంలో 50 నుంచి 60 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. దేశంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తే మనందరికీ 2023 గొప్ప సంవత్సరంగా మిగులుతుంది. పంటలు బాగా పండితే ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. రానున్న కాలంలో రైతులు సంతోషంగా ఉండాలని నేను కోరుకుంటున్నా'నని పవార్ చెప్పారు. రైతులు సంతోషంగా ఉంట దేశానికి మంచి రోజులు వచ్చినట్లేనన్నారు. ఇతర వ్యాపారాలు బాగా పుంజుకుంటాయన్నారు. ప్రపంచ వేదికపై భారత్ ఎగుమతులకు సంబంధించి అత్యంత కీలక దేశంగా అవతరిస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు. అందుకే పరిశ్రమలు, వాణిజ్యంలో కొత్త సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఎవరు అధికారంలో ఉన్నారనేది సమస్య కాదని, అందరూ రాజకీయ వైరుధ్యాలను పక్కనపెట్టి...ఆర్థిక వ్యవస్థను పటిష్టవంతం చేయడానికి కలిసిరావాలని పవార్ విజ్ఞప్తి చేశారు. జాతీయ రాజకీయాలను ప్రస్తావిస్తూ...పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో మాట్లాడేందుకు ప్రతిపక్షాలకు అవకాశమే రాలేదని పవార్ ఆరోపించారు. సభలో గందరగోళం కొనసాగిందని తెలిపారు.

అమిత్‌షా రాజకీయ వ్యాపారి : సిద్ద రామయ్య

బెంగళూరు: అవినీతిపరులతో బీజేపీని నింపేస్తున్న రాజకీయ వ్యాపారి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అని కాంగ్రెస్ సీనియర్ నేత సిద్దరామయ్య విమర్శించారు. కర్ణాటకలోని బీజేపీ శాఖలో నేతలను తొలగిస్తూ అవినీతిప రులకు కాషాయ కండువాలు కప్పేస్తుండటం ఆయన కపట బుద్ధికి నిదర్శనమ న్నారు. నియామకాలు, బదిలీలు, పదోన్నతులు, నిధు ల కేటాయింపు, పనుల అమలు, బిల్లుల చెల్లింపులు వంటివాటికి 40శాతం కమీషన్లు దండుకునే వారం తా కమలం దళ సభ్యులని సిద్ద దుయ్యబట్టారు. రూ.2వేలకోట్లకు ముఖ్యమంత్రి పదవిని విక్రయానికి పెట్టిన రాజకీయ వ్యాపారి అమిత్‌షా... కాంగ్రెస్‌పై అవినీతి విమర్శలు చేయడం హాస్యాస్పదమని కర్ణాటక మాజీ సీఎం ఎద్దేవా చేశారు. ఆపరేషన్ కమలం ద్వారా అక్రమంగా పుట్టిన బీజేపీ ప్రభుత్వం పేదలకు మరణశాసనాన్ని... అవినీతిపరులకు సంపదను బహూకరించిందని దుయ్యబట్టారు. విధానసౌధాను అవినీతి అడ్డాగా మార్చివేసిందని, ఇందులో అమిత్‌షా వాటా 40శాతమేనా అంటూ ట్వీటాస్త్రాలను సిద్దరామ య్య సంధించారు. 40శాతం కమీషన్ వల్ల కొందరు కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. జీఎస్టీ కేటాయింపుల్లో కర్ణాటకకు పూర్తి వాటా రాలేదని, వర్షాలు, కరవు, పంట నష్టానికి రైతులకు పరిహారం, రాష్ట్రంలోని కేంద్ర ప్రాజెక్టులకు నిధులనూ ఇవ్వలేదని సిద్దరామయ్య అన్నారు.

అన్నీ అవాస్తవాలు: బీజేపీ

సిద్దరామయ్య ఆరోపణలను బీజేపీ తిప్పికొట్టింది. ట్విట్టర్ మాధ్యమంగా స్పందిస్తూ కాంగ్రెస్, సిద్దరామయ్య అబద్దాలు ప్రచారం చేస్తున్నట్లు ఆరోపించింది. అవినీతికి రుజువులను ప్రధానమంత్రి కార్యాలయానికి ఇవ్వలేకపోయిందని పేర్కొంది. ముఖ్యమంత్రి పదవిని విక్రయానికి పెట్టలేదు.. కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను అమ్ముకున్న వారికి ఇలాంటి ఆలోచనలు మామూలే అని బీజేపీ ట్వీట్ చేసింది.

అంగుళం భూమి కూడా ఆక్రమించలేరు

సరిహద్దుల్లో ఐటీబీపీ సైనికుల గస్తీ ప్రశంసనీయం అమిత్ షా



బెంగళూరు : కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం ఇండో-టిబెట్ సరిహద్దు పోలీసులు (ఐటీబీపీ) ను ప్రశంసించారు. వారిని 'హిమవీర్' (మంచు ధైర్యవంతులు), వారు సరిహద్దుల్లో ఉన్నప్పుడు మన భూమిలో ఒక్క అంగుళం కూడా ఎవరూ ఆక్రమించలేరని అన్నారు. 'ఐటీబీపీ సిబ్బందిని అభినందిస్తూ, వారు కఠినమైన పరిస్థితులలో మన సరిహద్దులను కాపాడుతున్నారని, వారికి పద్మశ్రీ, పద్మవిభూషణ్ కంటే 'హిమవీర్' బిరుదు పెద్దదని అన్నారు. 'మైనస్ 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో వారు మన సరిహద్దులను ఎలా కాపాడాతరో మనం ఊహించలేము. ఇది బలమైన సంకల్ప శక్తి, అత్యున్నత స్థాయి దేశభక్తితో మాత్రమే జరుగుతుంది. ఐటీబీపీ అరుణాచల్ ప్రదేశ్, లడఖ్ లేదా జమ్ముకశ్మీర్‌లో వేసి భౌగోళిక పరిస్థితులలో పని చేస్తుంది' అని ఇక్కడ ఐటీబీపీ సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ని ప్రారంభించిన తర్వాత షా అన్నారు. 'భారతదేశంలోని ప్రజలు ఐటీబీపీ సైనికులను 'హిమవీర్' అని పిలుస్తారు. ఈ బిరుదు పద్మశ్రీ, పద్మవిభూషణ్ పౌర పురస్కారాల కంటే పెద్దది. పౌర పురస్కారాలు ప్రభుత్వ బిరుదు అయితే, 'హిమవీర్' అనేది భారతదేశ ప్రజలు ఇచ్చిన బిరుదు' అని షా సమావేశంలో అన్నారు. అన్ని కేంద్ర సాయుధ పోలీసు బలగాలలో ఐటీబీపీ అత్యంత కఠిన వాతావరణ పరిస్థితుల్లో పనిచేస్తుందని అన్నారు. 'మన ఐటీబీపీ సైనికులు గస్తీ లేదా క్యాంపింగ్ చేస్తున్నప్పుడు ఇండో-చైనా సరిహద్దుల గురించి నేను ఎప్పుడూ భయపడను. ఎందుకంటే అక్కడ ఎవరూ మా భూమిని ఒక్క అంగుళం కూడా ఆక్రమించలేరు' అని హోం మంత్రి తెలిపారు. కేంద్ర సాయుధ పోలీసు దళం (సీఏపీఎఫ్) సిబ్బందికి వారి ప్రధాన కార్యాలయంలో వారి కుటుంబంతో సమయం గడపడానికి భారత ప్రభుత్వం 100 రోజుల సమయం కల్పించాలని యోచిస్తోందని ఆయన అన్నారు. 'ఇది మానవ దృక్కోణం నుంచి అవసరం' అని షా పేర్కొన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఏపీఎఫ్ గృహ, ఆరోగ్య సౌకర్యాలను మెరుగుపరిచిందని హోం మంత్రి ఈ సమావేశంలో చెప్పారు. పరిశోధన ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ 'బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్ అండ్ డీ) అనేది పోలీసులకు పెద్ద బలాన్ని ఇచ్చే సంస్థ, కానీ దురదృష్టవశాత్తు, అది తగిన శ్రద్ధను పొందలేదు. అలాగే, దానికి రావాల్సిన గుర్తింపు రాలేదు' అని షా అన్నారు. 'మన సమాజం నిరంతర మార్పు ధోరణిని కలిగి ఉంది. 25 నుంచి 50 సంవత్సరాలలో సమాజం ఆలోచన, ఆకృతి, లక్ష్యాలు, మార్గం మారుతుంది. పోలీసులు ఈ మార్పు గురించి ఆలోచించడం మానేసినప్పుడు, అది అసంబద్ధం అవుతుంది. మీరు ఈ మార్పును అర్థం చేసుకుని, అనుభూతి చెందాలంటే, మార్పుతో మార్పులు చేసుకోవాలంటే పరిశోధన చాలా అవసరం' అని హోం మంత్రి తెలిపారు. క్రమబద్ధమైన సంస్కరణలు నిరంతర ప్రక్రియగా ఉండాలని, పరిశోధన పని ఆధారంగా వ్యూహాలను రూపొందించడం చాలా ముఖ్యం అని కూడా ఆయన నొక్కి చెప్పారు. దేశంలోని మొత్తం పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల తరఫున పరిశోధనలు చేయాల్సిన బాధ్యత బీపీఆర్ అండ్‌డీపై ఉందని ఆయన సూచించారు.

పంత్‌ను పరామర్శించిన డీడీసీఏ డైరెక్టర్

డెహ్రాడూన్: భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్‌ను ఢిల్లీ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) డైరెక్టర్ శ్యామ్ శర్మ శనివారం పరామర్శించారు. రిషభ్ పంత్‌కు అందుతున్న వైద్య సేవల పట్ల శర్మ సంతోషం వెలిబుచ్చారు. శుక్రవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మాక్స్ ఆసుపత్రిలో పంత్ చికిత్స తీసుకుంటున్న విషయం విదితమే. పంత్‌కు డాక్టర్లు మంచి వైద్య సేవలు అందిస్తున్నారని, బీసీసీఐ సైతం నిత్యం పంత్ ఆరోగ్యం గురించి తెలుసుకుంటుందని శర్మ చెప్పారు. పంత్‌ను పరామర్శించిన తర్వాత శర్మ ఆసుపత్రి వెలుపల విలేకరులతో మాట్లాడారు.

ఘోర రోడ్డు ప్రమాదం నుంచి పంత్ తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న విషయం విదితమే. ప్రమాదంలో పంత్‌కు తలపైన, వీపునకు, కాలికి గాయాలయ్యాయి. పంత్ ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు, పోలీసులు తెలిపారు. బాగా చీకటిగా ఉండటం వల్ల ప్రమాదం జరిగినట్లు పంత్ చెప్పారని ఓ ప్రశ్నకు సమాధానంగా శర్మ తెలిపారు.

జగన్ పాలన ప్రజలను క్షోభలోకి నెట్టింది

టీడీపీ అధినేత చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: జగన్ పాలన ప్రజలను క్షోభలోకి నెట్టిందని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నెల్లూరు జిల్లాలో మూడు రోజుల పర్యటన ముగిసిన అనంతరం శనివారం నార్త్ రాజుపాలెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022వ సంవత్సరానికి వీడ్కోలు పలుకు తున్నామని, బాదుడు, విద్వేషాలు, విషాదాలు, విధ్వంసాల సంవత్సరంగా ఈ ఏడాది మిగిలిపోయిందని తెలిపారు. ప్రతి వ్యక్తీ శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా క్షోభ అనుభవించారని, ప్రభుత్వ విధానాల కారణంగా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని అన్నారు. ప్రశ్నించిన వారిపై దాడులు చేసి, అక్రమంగా కేసులు పెట్టారని, ఇవన్నీ ప్రజలను క్షోభలోకి నెట్టాయని అన్నారు. జగన్‌ను సైకో అని ఏదో మాట కోసం అనడం లేదని, అన్ని వర్గాలు ఇబ్బందులు పడుతుంటే జగన్, అతని టీం ఆనంద పడుతున్నారని తెలిపారు. మీడియాను కొట్టి ఆనందం పొందుతున్నారని, సీఐడీ కేసులతో వేధింపులకు పాల్పడుతున్నారని అన్నారు. అదేవిధంగా దేశంలో ఎక్కడా లేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరలు, కరెంట్ చార్జీలు మన రాష్ట్రంలోనే అధికంగా ఉన్నాయని చెప్పారు. పెంచిన ధరలు, పన్నులతో ప్రజలపై తీవ్ర భారాన్ని జగన్ ప్రభుత్వం మోపిందని ఆరోపించారు. దేశంలో రైతులపై అత్యధిక అప్పున్న రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ అని, ఒక్కో రైతుపై సగటున రూ.2.42 లక్షల అప్పు ఉందని అన్నారు. ప్రతి రైతూ అప్పుల్లో ఉన్నాడు. రైతు ఆత్మహత్యల్లో మూడవ స్థానం, కౌలు రైతు ఆత్మహత్యల్లో రెండో స్థానంలో రాష్ట్రం ఉందని అన్నారు. అధికారికంగానే 1,673 మంది రైతుల అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్నారని, మనిషి అనే వాడు కనీసం ఆలోచిస్తాడు... కానీ ఈ సీఎం ఆలోచన కూడా చేయడం లేదని చంద్రబాబు ధ్వజమెత్తారు. ఒక క్వింటా ధాన్యానికి 25 కేజీలు అదనంగా తీసుకుంటు న్నారని, రేషన్ బియ్యం ఇచ్చిన వెంటనే సేకరించి పోర్టుల ద్వారా విదేశాలకు తరలిస్తున్నారని తెలిపారు. కేంద్రం ఇచ్చిన బియ్యం కూడా పంపిణీ చేయలేదని అన్నారు. రాష్ట్రంలో బియ్యం తరలింపు జరిగిందన్న విషయాన్ని పార్లమెంట్‌లో స్వయం గా కేంద్ర మంత్రి చెప్పారని వివరించారు. రాష్ట్రంలో అన్ని చోట్లా గంజాయి, డ్రగ్స్ సరఫరా జరుగుతోంది. మద్యం రేట్లు పెరగడంతో తాగలేక... మందుబాబులు గంజాయికి అలవాటు పడు తున్నారని అన్నారు. సీఎం ఎందుకు ఇంత తీవ్రమైన అంశంపై స్పందించడం లేదని ప్రశ్నించారు. మూడున్నరేళ్లలో రాష్ట్రంలో మహిళలపై 52 వేల దాడులు, వేధింపుల ఘటనలు జరిగాయన్నారు. నెల్లూరు లాంటి జిల్లాలో 11 మందిపై వివిధ రకాల అఘాయిత్యాలు జరిగాయని తెలిపారు. ఒక పోలీసు 5 మంది ప్రాణాలు పోవడానికి కారణమయితే ప్రజలు ఎందుకు ప్రశ్నించలేదు. ఇవి దారుణ పరిస్థితులు కాదా అని అన్నారు. మూడున్నరేళ్లలో 21 వేల మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఉద్యోగాలు లేవని, ఎక్కడ చూసినా నిరాశ నిస్పృహలే ఉండటంతో ఆత్మహత్యలు పెరిగాయని చెప్పారు. ఇందుకు కారణం రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అని అన్నారు. ఐటీలో మేటిగా నాడు నిలిచిన యువత నేడు నిస్సారంగా అయిపోయారన్నారు. గోల్డెన్ క్వాడ్రిలేటర్ కింద నాడు వాజ్‌పేయిని ఒప్పించి ఈ ప్రాంతంలో జాతీయ రహదారి వేయించామని, ఇప్పుడు రాష్ట్ర రహదారుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. స్కూళ్లలో నాడు-నేడు అని రంగులు వేసిన ప్రభుత్వం... విద్యా ప్రమాణాల్లో రాష్ట్రాన్ని దేశంలో 19వ స్థానానికి దిగజార్చారని అన్నారు. స్కాలర్ షిప్‌లు కొత్తగా వచ్చిన పథకమా? కానీ జగన్ దాన్ని కూడా పథకం అని చెపుతున్నాడు. రాష్ట్రంలో ఇంజినీరింగ్, వైద్య విద్య మనుగడ సాధించే పరిస్థితి ఉందా? అగ్రశ్రేణి ఐదు విశ్వవిద్యాలయాలను అమరావతికి తీసుకువస్తే... కనీసం వాటికి రోడ్లు కూడా వెయ్యలేదని అన్నారు. రాష్ట్రంలో 2.70 లక్షల టిడ్కో ఇళ్లు కట్టామని, 90 శాతం పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందించకుండా ఈ ముఖ్యమంత్రి ఆ ఇళ్లను భూత్ బంగ్లాలుగా మార్చేశారని ఆరోపించారు. వైసీపీలో ఎమ్మెల్యేలు నాడు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారు ఇప్పుడు కోట్లు కూడబెట్టారు. రాష్ట్రంలో ఎక్కడ లే అవుట్ వేసినా ఎమ్మెల్యేలకు వాటా ఇవ్వాల్సిందే. రాష్ట్రంలో సొంత ఆస్తి అమ్ముకోవాలంటే కూడా ఎమ్మెల్యేకు కమీషన్ ఇవ్వాలి. సిలికా శాండ్ అమ్మకాల్లో సొంతవర్గం వారిని కూడా జగన్ రెడ్డి బ్యాచ్ వదల్లేదు. మెడమీద కత్తి పెట్టి ఆస్తులు రాయించు కుంటున్న సీఎం జగన్ రెడ్డి అని అన్నారు. దానికి కృష్ణపట్నం పోర్టు వ్యవహారమే ఉదాహరణ అని తెలిపారు. కందుకూరు ఘటనకు పోలీసు వైఫల్యం కారణమయితే, దానికి కూడా ఈ ప్రభుత్వం నన్ను తప్పు పడుతుందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని ముఖ్యమంత్రుల్లో సంపన్నమైన ముఖ్యమంత్రి ఈ జగన్ రెడ్డి అని, ఆయన ఆస్తి రూ.370 కోట్లు అని అన్నారు. సీబీఐ చార్జిషీట్‌లో వేసింది రూ.43 వేల కోట్లని తెలిపారు. దేశంలో జడ్జిలను బ్లాక్ మెయిల్ చేసిన వ్యక్తులు ఎక్కడైనా ఉన్నారా... ఆ పని కూడా ఈ వైసీపీ నేతలు చేశారని ఆరోపించారు. నెల్లూరులో కేసుకు సంబంధించిన ఫైళ్లను కోర్టులో దొంగతనం చేశారని, కోర్టులో ఫైళ్లు దొంగతనం చేసే స్థాయికి వచ్చారంటే ఏమనుకోవాలని అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలన్నింటిపైనా, అలాగే న్యాయ వ్యవస్థ మొదలు మీడియా, ప్రతిపక్షాలపై దాడులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎస్సీ, బీసీ సబ్ ప్లాన్‌లన్నీ రద్దు చేశారని, బీసీలకు ఇచ్చే 'ఆదరణ' లాంటి బ్రహ్మాండమైన పథకం నిలిపివేశాడని తెలిపారు. రాష్ట్రంలో నీటిపారుదల రంగాన్ని నాశనం చేశారని, పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేశారని అన్నారు. టీడీపీ 'బాదుడే-బాదుడు' అనే కార్యక్రమాన్ని ప్రారం భించిన తరువాత జనంలో కదలిక వచ్చిందని తెలిపారు. 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' అనే కార్యక్రమాన్ని ప్రజలు తమకు అన్వయించుకున్నారని, ఆ కార్యక్రమం అందుకే విజయవంతమైందని వెల్లడించారు. ప్రజల్లో ఆందోళన, అభద్రతా భావం ఉందని, అందుకే మా సభలకు జనం తరలి వస్తున్నారని, ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని అన్నారు. వైసీపీ నేతలను హెచ్చరిస్తున్నా... జగన్‌ను సైకో అంటే నేను తిట్టడం కాదు. అతని తీరుచూసి చెపుతున్నా, 2022 విధ్వంసాలు, అరాచకాలతో ముగిసింది. 2023 ఒక ఆశ, తీవ్ర మార్పులకు కారణం అవుతుందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంపై గౌరవం ఉన్న నాయకులు వైసీపీలో కూడా ఇక కొనసాగలేరని, వారిలోనూ చర్చ మొదలైందని అన్నారు.

విశాలాంధ్రలో నూతన సంవత్సర వేడుకలు

క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ: విశాలాంధ్ర దినపత్రిక ప్రధాన కార్యాలయం చంద్రం బిల్డింగ్స్‌లో శనివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. 2022 సంవత్సరానికి వీడ్కోలు, 2023కు స్వాగతం పలుకుతూ విశాలాంధ్ర విజ్ఞాన సమితి నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కోశాధికారి గుజ్జుల ఓబులేసు, జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి ఆవిష్కరించారు. కేక్ కట్‌చేశారు. విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ ప్రజల్ని చైతన్య పథంలో నడిపించటంలో విశాలాంధ్ర పత్రిక పాత్ర ఎంతో కీలకమైనదని అన్నారు. పత్రికకు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా స్థాయిని ఏమాత్రం తగ్గించకుండా ప్రజల ముందుకు తీసుకెళుతున్న సిబ్బందిని అభినందించారు. యాజమాన్యం తన శక్తియుక్తులు ఒడ్డి సిబ్బందికి మేలు కలిగించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయటం వల్లనే నిలబడ గలుగుతున్నామన్నారు. కార్యక్రమంలో చీఫ్ అకౌంటెంట్ రాంబాబు, విశాలాంధ్ర ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటేశ్వరరావు, ఎం.మురళీకృష్ణ, సీపీఐ విశాలాంధ్ర శాఖ కార్యదర్శి పి.మధుసూదనరావు, చీఫ్ ఆఫ్ బ్యూరో చావా రవి, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్టీయూ డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరించిన మంత్రి మేరుగు నాగార్జున

విశాలాంధ్ర- గుంటూరు: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ), గుంటూరు జిల్లా శాఖ అధ్వర్యంలో 2023 ఎస్టీయూ డైరీ, క్యాలెండర్, స్టిక్కర్ క్యాలెండర్లను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున చేతుల మీదుగా వారి స్వగృహంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎస్టీయూ డైరీ, జీవోల పుస్తకం కరదీపికగా ఉపయోగ పడుతుందని తెలిపారు. సర్వీసు, సెలవు నిబంధనలు, పీఆర్సీ, అధికారులు, కార్యా లయాలు తదితర అన్ని అంశాలతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉప యుక్తంగా సమగ్రంగా డైరీ రూపొందించారని ఎస్టీయూ నాయకులను అభినందించారు. ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ గత 75 సంవత్సరాలుగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూనే, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు, ఉపాధ్యాయ సంక్షేమానికి, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎస్టీయూ విశేష కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు, ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు వాసిమళ్ల ప్రసాదరావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్లు కమతం శ్రీనివాసరావు, డీఏ జోసెఫ్, ఎంపీ సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షులు పేరేచర్ల శ్రీనివాసరావు, హెడ్ క్వార్టర్ కన్వీనర్ వై.శ్యాంబాబు, నాయకులు కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.